కొత్తపల్లి

తెలుగు పిల్లల ఈ మాసపత్రిక   వెల రూ.25/-

సెప్టెంబర్ 2015

గురుపూజోత్సవ శుభాకాంక్షలతో





సంపుటి: 1 సంచిక: 5 పుటలు: 68 విడి ప్రతి వెల: 25 సెప్టెంబరు 2015

Editor: Narayana Sarma

Owned, Printed and Published by:
Kottapalli Prachuranalu,
1-127/A, Near MRO Office,
Chennekothapalli,
Ananthapuramu District
Andhra Pradesh-515101
Website: http://kottapalli.in
Email: team@kottapalli.in
Phone: 7702877670

Printed at:
Mudrica Offset Printers,
Sanyasi Raju street,
Gandhi Nagar,
Vijayawada,
Andhrapradesh
Phone: 08662579129

RNI Registration No: APTEL/2014/62705
(Postal Registration No: See wrapper)

సంపాదకులు: నారాయణ శర్మ

గౌరవ సలహాదారు: యు. సుబ్బరాజు

ప్రచురణ:

కొత్తపల్లి ప్రచురణలు, చెన్నేకొత్తపల్లి

యాజమాన్యం:

సత్య - ఫౌండేషన్ ఫర్ ఎ హెల్దీ సొసైటీ, చెన్నూరు.

చిత్రాలు:

అడవి రాముడు: 9491870753

ఫైనార్ట్స్ చదువుతున్న ఇతర మిత్రులు కూడా.

వెబ్సైటు నిర్వహణ:

ఆనంద్, లక్ష్మి

వాణిజ్యం, మార్కెటింగు:

కె. మల్లికార్జున: 9000453887



విషయసూచిక

కర్తవ్యం!

దేశాధినేతలు కొందరు చాలా వింతగా ఉండేవాళ్ళు.



ఒకప్పుడు ఫిలిప్పీన్స్ దేశానికి ఫెర్డినాండ్ మార్కోస్ అనే ఆయన అధ్యక్షుడిగా ఉండేవాడు. ఆయన భార్య పేరు ఇమెల్డా. ఆయనకంటే ఎక్కువ అధికారాన్ని చెలాయించేది ఆవిడ! ఆమెకు ఖరీదైన వస్తువులంటే మహా ఇష్టం ఉండేది. తనకు కావలసిన వస్తువుల్ని ప్రభుత్వ ఖర్చుతో కొనుక్కునేందుకు ఆమె వేరే దేశాలకు వెళ్ళేదట! అప్పుడు ఆమె విమానం వెంట మరో నాలుగు విమానాల పనివాళ్ళు వెళ్ళేవాళ్ళుట! మార్కోస్ ప్రభువు అమెరికాకు సన్నిహితంగా ఉండేవాడు- దాంతో ప్రపంచ బ్యాంకుతో సహా అనేక దేశాలు ఫిలిప్పీన్స్‌కు లెక్కకు మిక్కిలిగా అప్పులిచ్చాయి. మార్కోస్, ఆయన కుటుంబం ఆ డబ్బులతో పండగ చేసుకున్నారు- ఏవేవో కంపెనీలు, హోటళ్ళు, పెయింటింగులు, ఏవి చిక్కితే అవి కొనుక్కున్నారు. చివరికి జనాలు తిరగబడి విప్లవం తెచ్చారు. దాంతో ఆయన తన కుటుంబంతోటీ, ఆస్తులతోటీ కూడా పారిపోయి, అమెరికాలో తల దాచుకున్నాడు. పారిపోతున్న ఇమెల్డా తనకున్న మూడు వేల చెప్పుల జతల్ని, వందలాది పెయింటింగులనీ ఫిలిప్పీన్స్‌లోనే వదిలేసి పోతే కొత్త ప్రభుత్వం వాళ్ళు ఓ మ్యూజియం పెట్టి వాటిని ప్రదర్శించారు. మరి మార్కోస్ దంపతులు అమెరికాకు వెళ్ళాక 150 బిలియన్ డాలర్ల విలువైన భవనాలు కొన్నారట. ఓ 750 బిలియన్ డాలర్లను అక్కడి బ్యాంకులనుండి అప్పుగా తీసుకొని వాటికి రిపేర్లు చేయించారట!



ఒకప్పుడు జర్మనీ దేశాన్ని పరిపాలించాడు అడాల్ఫ్ హిట్లర్. అతనికి 'మేము ఆర్యులం' అని బలే నమ్మకం ఉండేది. వాళ్ల దేశంలోనే చాలా మంది యూదు జాతి వాళ్ళు ఉండేవాళ్ళు. వాళ్ళు 'ఆర్యులు కారు' అని కూడా హిట్లర్ గట్టిగా నమ్మేవాడు. దాంతో సమయం చూసుకొని, సైనిక

పరిపాలకుడిగా తనకుండే అధికారాలను ఎంచక్కా పెంచేసుకొని, పన్నెండేళ్ళపాటు రాజ్యంలో దొరికిన యూదుడినల్లా గాలి చొరని భూగర్భ గృహాలలో బంధించేసి, 'రోజుకు ఇంతమంది' అన్నట్లుగా విష వాయువుల్ని పంపి చంపించాడు. ఇట్లా అతని చేత చంపబడ్డ యూదులు కనీసం అరవై లక్షల మంది ఉంటారని చెబుతారు! చివరికి హిట్లర్‌కు ఉన్న జాత్యహంకారం ముదిరి రెండో ప్రపంచ యుద్ధాన్నే తీసుకొచ్చింది!




ఇంకోవైపున, రష్యాను ఒకప్పుడు జార్ చక్రవర్తులు పరిపాలించేవాళ్ళు. వాళ్ళు భోగలాలసులై జనాల్ని పట్టించుకోలేదు. దాంతో ప్రజలు తిరగ బడ్డారు. ఆ రోజుల్లో 'అందరూ సమానం' అని చెప్పేవాడు, జోసెఫ్ స్టాలిన్ అనే ఆయన. ఆ స్టాలిన్‌కు అధ్యక్ష పదవి కట్టబెట్టారు తిరుగుబాటుదారులు. ఆ తర్వాత స్టాలిన్ తనకు అడ్డువచ్చిన వాళ్లనల్లా 'దేశద్రోహి' అని ఉరికంబాలెక్కించాడు. తనవాళ్లకు అధికారం కట్టబెట్టాడు. 'తాము చెప్పే మాటను అందరూ వినాలి' అని గట్టిగా భావించాడు. తనూ, తన మనుషులూ ఆడింది ఆట, పాడింది పాటగా ప్రవర్తించాడు. "రష్యా వెలిగిపోతున్నది - అమెరికాకు ఇది పోటీ" అని బయటి ప్రపంచానికి ఒక భ్రాంతి కలిగించాడు. దేశ ఆర్థిక వ్యవస్థ చాలా ఘోరం అయిపోయేవరకూ ఆ అబద్ధాన్ని నిజం చేసేందుకే తన్నుకులాడింది రష్యా. రాను రాను 'రష్యాలో అందరూ సమానమే, కానీ కొందరు మటుకు ఎక్కువ సమానం' అని ఎగతాళికి గురైంది. చివరికి ఒక్కటిగా నిలబడలేక ముక్కలు ముక్కలైపోయింది!



ఆఫ్రికాలో ఉగాండా అని ఒక దేశం ఉంది. దానికి ఒకప్పటి అధ్యక్షుడు, 'ఇది-అమీన్' అనే ఆయన. ఆయన 'నరమాంసం తినేవాడు'అని పుకార్లు. ఆయన చేతిలో హతమైనవాళ్ళ లెక్క ఇంకా తేలలేదు. మానవహక్కులకు అతను కట్టినట్టుగా మరెవ్వరూ గోరీ కట్టలేదని చెబుతారు. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వారి లెక్కల ప్రకారం, అతని చేతిలో కనీసం ఐదు లక్షల

మంది మరణించి ఉంటారు! ఆ రోజుల్లో ఓసారి ఆఫ్రికా ఆర్థిక వ్యవస్థను బాగు చేయాలనుకున్నాడట అతను. దాంతో ఇంక అప్పటికి వాళ్ళ దేశంలో నివసిస్తూ ఉన్న ఆసియా వాసులు ఓ 80,000 మందిని దేశం నుండి తరిమేశాడు. అట్లా తరిమేసాక, వాళ్ళ భూముల్ని, ఆస్తుల్ని, కంపెనీలను అన్నిటినీ జప్తు చేసి, వాటిని తన మద్దతుదారులకు ఇచ్చుకున్నాడట అమీన్. వాళ్ళేమో ఆ ఆస్తుల్ని సరిగా నిర్వహించక, దివాలా తీయించి, దేశ ఆర్థిక వ్యవస్థను మరింత ఛిన్నాభిన్నం చేశారు.



ఇక మన పొరుగుదేశం పాకిస్తాన్- ప్రజాస్వామ్య దేశం- అయినా అక్కడి సైన్యం పరిపాలనలో ఎన్ని సార్లు నేరుగా జోక్యం కలగజేసుకున్నదో లెక్కలేదు. అనేకమార్లు ప్రజాస్వామ్యం నియంతృత్వం అయ్యింది; అనేక ఒత్తిళ్ళ నడుమన నియంతృత్వం తిరిగి ప్రజాస్వామ్యం అయ్యింది. పాకిస్తాన్‌ను ఆనుకొని ఉన్న ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబాన్ నేతలు మతాన్ని ఆయుధాలతోటీ, కట్టుబాట్లతోటీ ఎంత విచక్షణా రహితంగా జోడిస్తున్నారో మలాలా యూసుఫ్‌జాయ్ రకరకాలుగా చెప్పింది. ఈ గొడవలకు నిజంగా అంతం ఉన్నట్లు తోచదు.

ప్రపంచంలో ఇన్నిన్ని గందరగోళాలు ఉండగా మనం మటుకు అరవైఎనిమిది ఏళ్ళ పాటు 'మతప్రసక్తి లేని- లౌకిక – ప్రజాస్వామ్య – గణతంత్ర రాజ్యం'గా నిలిచామనేది చూస్తే, ఒక రకంగా చాలా అద్భుతం అనిపిస్తుంది. దీనికి కారణం సమున్నతమైన మన వారసత్వమేనేమో- మహాత్మా గాంధీలోని మానవత, బాబా అంబేద్కర్‌లోని రాజ్యాంగ పటిమ, సర్వేపల్లి రాధాకృష్ణన్ తాత్వికత, జవహర్‌లాల్ నెహ్రూ విదేశాంగ విధానం, సర్దార్ పటేల్‌లోని ఉక్కు తత్వం, లాల్‌బహదుర్ శాస్త్రి గట్టితనం,.. ఇవన్నీ నిరంతర ప్రవాహాలుగా మన సంస్కృతికి ఎప్పటికప్పుడు జీవం పోస్తూ వచ్చాయి. వీరి వ్యక్తిత్వాలు మనందరికీ మార్గదర్శకాలుగా నిల్చాయి.

జులై 27 న పరమపదించిన మన పదకొండవ రాష్ట్రపతి డా.ఎ.పి.జె అబ్దుల్ కలాం మన ఈ వారసత్వానికి జాజ్వల్యమానమైన మరొక ప్రతీక. శాస్త్రవేత్తగా ఉన్నత శిఖరాలను అధిరోహించి, 'భారత క్షిపణి పితామహుడు' అనిపించుకొని, రాష్ట్రపతిగా మనదేశ అత్యున్నత పీఠాన్ని అధిరోహించిన అబ్దుల్ కలాం ఏలాంటి భేషజాలూ లేకుండా, చనిపోయేవరకూ అత్యంత సాధారణ జీవితాన్ని గడిపారు.



శాస్త్రీయతకు, మత సామరస్యానికి, నిరాడంబరతకు, త్యాగశీలతకు, సౌశీల్యతకు, నిబద్ధతకు, దేశ ప్రజల పట్ల ప్రేమాభిమానాలకు నిలువెత్తు నిదర్శనాలైన ఇలాంటి మహనీయులు పుట్టిన భూమిలో పుట్టటం నిజంగానే మన అదృష్టం. వారి ఆశయాలకు జీవం పోయటం మనందరి కర్తవ్యం.

కొత్తపల్లి బృందం



ఉన్నతమైన ఆదర్శాన్ని కలిగి ఉండాలి; దాన్ని సాధించేందుకు ఓపికగా శ్రమించాలి; ఇదే మన జీవనసూత్రం కావాలి- డా.బి.ఆర్.అంబేద్కర్



నీతి చంద్రిక

సంధి-12

నీతి చంద్రిక 59 వ భాగం. ముగింపు వచ్చే మాసం...

మూలం : కీ. శే. కందుకూరి వీరేశలింగం *సరళీకరణ: ఘడియారం వేంకట నారాయణ శర్మ*

'అపరీక్షకారి' బ్రాహ్మణుడి కథ

(పరీక్షించక త్వరపడిన బ్రాహ్మణుడి కథ)

గౌడ దేశంలో ఒక అగ్రహారం ఉండేది. అందులో దేవశర్మ అనే బ్రాహ్మణుడు ఒకడుండేవాడు. అతనికి పెద్దగా చదువు, జ్ఞానమూలేవు. అతనికి, అతని భార్య యాజ్ఞసేనికి వేరే సమస్యలు కూడా ఏమీ లేవు- 'సంతానం లేక పోవటం' అనే ఒక్క కొదవ తప్ప.

దేవశర్మకు అదేమంత కష్టం అనిపించేది కాదు గాని- యాజ్ఞసేని మాత్రం, తనకు పిల్లలు లేకపోవటం చేత, పిల్లల్ని కని-పెంచుతూ ఉన్న తన తోటివాళ్లనందరినీ చూసి ముచ్చట పడేది; యోగుల మాదిరి వేషాలు వేసుకున్న వాళ్లు ఎవరు కనిపిస్తే వాళ్లనల్లా ఆశ్రయించేది; వాళ్ల కాళ్ళు ఒత్తి, భోజనాలు పెట్టి సత్కరించేది; వాళ్ల చేత ఏ వేరో, వెల్లంకో కట్టించుకునేది. కనిపించిన

రాయికల్లా మ్రొక్కేది; ఏ గుడి కనిపిస్తే దానికల్లా నమస్కరించుకునేది; ఎవరు ఎందులో మునగమంటే ఆ తీర్థంలో మునిగేది; లోకంలో లేని వ్రతాలను-నోములను అన్నిటినీ నోముకుంటూ ఉండేది.

ఇట్లా కొంతకాలం గడిచాక, భగవంతుడి దయవల్ల యాజ్ఞసేని కడుపుపండింది. ఒక కుమారుడిని కన్నది. లేక లేక కల్గిన సంతానం కాబట్టి తల్లి తండ్రులు ఆ పిల్లవాడిని చాలా గారాబంగా, ప్రాణాలకంటే ఎక్కువగా, "రొమ్ముమీది కాలు నేల మీద పెట్టనివ్వకుండా" పెంచుకోసాగారు.

ఒక రోజున యాజ్ఞసేని ఆ పిల్లవాడికి పాలిచ్చి నిద్రపుచ్చి, ఉయ్యాలలో పడుకోబెట్టింది. వాడికి తన భర్తను కాపలాగా ఉంచి, పొరుగు వీధిలోనే ఉన్న తల్లిగారి ఇంటికి వెళ్ళింది. ఆరోజు పండుగ రోజు కూడానూ. అదే రోజున ఆ దేశపు రాజుగారు తమ తల్లిగారి తిథి (సంవత్సరానికి ఒక సారి చనిపోయిన వారిని తలచుకుంటూ చేసే తంతు- శ్రాద్ధం) చేసుకుంటున్నారు. శ్రాద్ధం రోజున 'ఇంతమంది బ్రాహ్మణులకు' అని లెక్కగా బంగారం-ఆవులు మొదలుకొని, నువ్వులు-ఉప్పు వరకు ఏవేవో సంబారాలు దానం ఇవ్వటం ఆనవాయితీ. విధివశాత్తు, ఆ సంవత్సరం ఎందుకనో రాజుగారికి దేవశర్మ గుర్తుకొచ్చాడు. తల్లిగారి తిథి సందర్భంగా వచ్చి, తానిచ్చే దానం స్వీకరించాలని దేవశర్మకు కబురుపంపారాయన.



ఇప్పుడు దేవశర్మ చిక్కుల్లో పడ్డాడు-"నేనా, నిత్యదరిద్రుడిని. కలగక కలగక- ఇవాల్టికి కదా, ప్రభువులవారికి నా మీద అనుగ్రహం కల్గింది?! బాగా చదువుకున్న పండితులు అనేకమంది ఉండగా, వాళ్లందరినీ కాదని, నాకే దానం ఇస్తానని వర్తమానం పంపారుకదా, ఆయన?! నన్ను

భాగ్యవంతుడిని చెయ్యాలనే ఉద్దేశంతో ప్రభువులవారు నన్ను పిలువనంపితే, నా దురదృష్టం ఎట్లా ఉందో చూడు- ఇట్లాంటి ఇరుకున పడి ఉన్నాను నేను! పుట్టినింటికి వెళ్లిన నా భార్య తిరిగివచ్చేది ఎప్పటికి, నేను పోయి దానం పట్టేది ఎప్పటికి?! పోనీ, 'ఆమె రాకున్నా పర్వాలేదు; నేను పోతాను' అంటే, మరి ఇంతవరకూ కంటికి రెప్పలాగా కాపాడుకుంటున్న పిల్లవాడి దగ్గర కనిపెట్టుకొని ఉండేవాళ్లెవరూ లేరే! పోనీ 'నేను రాజుగారి దగ్గరికి పోనులే, మానేస్తాను' అంటే ప్రభువుల వారు నాకోసం శ్రాద్ధాన్ని ఆపరు కదా- వేరే ఎవరికో ఇచ్చేస్తారు కదా, ఆ దానాన్ని?!" అని చాలా గందరగోళ పడ్డాడు.

ఆ సమయంలో అతనికి ఒక ఉపాయం తోచింది. తమ పెంపుడు ముంగిస గుర్తుకొచ్చింది. "ఇంక ఇప్పుడు నాకు ఒకే ఒక్క మార్గం తోస్తున్నది- చాలా రోజుల నుండి కన్నబిడ్డలాగా పెంచుకుంటున్న ముంగిస ఉన్నది కదా? దాన్ని మా పిల్లవాడికి కాపలాగా ఉంచుతాను. ముద్దుల కొడుకుకి దాన్ని కాపలాగా ఉంచి, నేను చటుక్కున పోయి వస్తాను. రాజుగారు ఇచ్చే దానం పుచ్చుకొని, ఉన్నవాడిని ఉన్నట్టే పరుగెత్తుకొని వచ్చేస్తాను, దానిదేమున్నది?!" అని ఒక నిశ్చయానికి వచ్చాడు.



ఆ వెంటనే పెంపుడు ముంగిసను దగ్గరికి పిలిచి, దానికి నోటితోనూ, రకరకాల సైగలతోనూ సందర్భాన్నంతా దానికి అర్థమయ్యేట్లు వివరించాడు. సంగతి అర్థమైనట్లు అది కూడా తలాడించింది.

ఆ వెంటనే దేవశర్మ బయలుదేరి రాజమందిరానికి పోయాడు. అక్కడికి

చేరుకునేందుకు పట్టింది రెండు ఘడియలే అయినా, యుగాలు గడిచినట్లు అనిపించింది అతనికి. రాజమందిరానికి చేరుకున్నాక కూడా, అదే పరిస్థితి- అతని శరీరం అయితే రాజమందిరంలో ఉన్నది గానీ, మనసంతా ఇంట్లో కుమారుడి మీదనే ఉన్నది!

ఇక, అక్కడ ఇంట్లో పరిస్థితి మరో విధంగా ఉండింది. విధి ఎలా ఉంటుందో చూడండి- దేవశర్మ అటు వెళ్ళాడో, లేదో నల్లటి త్రాచుపాము ఒకటి మిద్దెమీద నుండి జారి, ఇంటి కప్పు లోపల పడింది. ముంగిస నేలమీద కూర్చొని గమనిస్తూండగానే అది కప్పు పైన పాక్కుంటూ సరిగ్గా ఉయ్యాల మీదికి చేరుకున్నది. అటుపైన ఉయ్యాల కట్టిన బట్ట వెంబడి జారుతూ పిల్లవాడు నిద్రపోతున్న పరుపుల మీదికే రాసాగిందది!

దానినే చూస్తూన్న ముంగిస అది తనకు అందుబాటులోకి రాగానే ఒక్క ఎగురు ఎగిరి, తటాలున దాని మెడ పట్టుకొని కొరికి, అలవోకగా ఆ త్రాచును ముక్కలు ముక్కలు చేసి, క్రింద పడేసింది.

ఇంక ఆ లోపల, అక్కడ రాజుగారి నుండి దానాలు ముట్టే వరకూ దేవశర్మ ప్రాణం ప్రాణంలో లేదు. అది తన చేత పడగానే ఇక అతను వెనక్కి బయలు దేరాడు. కొడుకు మీది ప్రేమ తనని త్వరపెడుతుంటే, కాళ్ళు నేలమీద ఆననట్లు ఉరుకులు పరుగులుగా ఇంటికి పరుగు తీశాడు.



దూరం నుండే యజమాని అడుగుల చప్పుడు విన్నది ముంగిస. అతను ఇంకా ఇంట్లోకి రాకనే సంతోషంతో అతనికి ఎదురేగింది. అతని కాళ్లు చుట్టుకొని సంబరపడటం మొదలు పెట్టింది. పాముని కొరికి ముక్కలు చేసి ఉన్నది కదా, దాని నోటికి అంతా రక్తం అంటుకొని ఉన్నది. అందువల్ల అది నడచిన దారి పొడవునా దాని నోట్లోంచి రక్తపు బిందువులు కారినై.

ఆ విధంగా రక్తసిక్తమైన నోటితో ఎదురొచ్చిన ముంగిసను చూసి బ్రాహ్మణుడి గుండెలు తటతటా కొట్టుకున్నాయి. అంతులేని భయంతో అతని ఆలోచలను స్తంభించిపోయినై. అది తన కుమారుడినే చంపి వచ్చిందని నిశ్చయంగా అనిపించింది అతనికి! దాంతో అతనికి కోపం మిన్ను ముట్టింది. ఎక్కడ లేని పౌరుషం వచ్చింది. దగ్గరలోనే ఉన్న ఒక దుడ్డుకర్రను అందుకొని, మతి పోయినవాడి మాదిరి "పెంచిన విశ్వాసం కూడా లేదే, నీకు! నా గారాల కొడుకును, పసిబిడ్డను ఎట్లా కొరుక్కుతిన్నావే!" అని అరుస్తూ ఆ ముంగిసను ఇష్టం వచ్చినట్లు మోదాడా పిచ్చి బ్రాహ్మణుడు. అతను కొట్టిన దెబ్బ ఒకటి నేరుగా ముంగిస తలకు తగిలేసరికి, అంతవరకూ అతని కాళ్ళే చుట్టుకొని తిరిగిన ఆ పిచ్చి ప్రాణి కాస్తా పాపం గుడ్లు వెళ్ళబెట్టి, నేలమీద పడి విల విలా తన్నుకుంటూ, పెద్ద అరుపొకటి అరచి ప్రాణం విడిచింది.

అట్లా ముంగిస ఉసురు పోసుకున్న బ్రాహ్మణుడు కొడుకు కోసం పరితపిస్తూ, బిగ్గరగా ఏడుస్తూ లోనికి పరుగుపెట్టాడు. చూడగా అక్కడ పరుపులో చెక్కుచెదరకుండా నిద్రపోతున్నాడు పిల్లవాడు!

వాడిని అట్లా సుఖంగా చూసేసరికి బ్రాహ్మణుడి గుండెమంట టక్కున చల్లారింది. గబగబా వెళ్ళి కొడుకును ఎత్తుకొని ముద్దాడేసరికి అతని మనసు తేలికైంది.



అంతలోనే ఆ వెనకగా, ఉయ్యాల ప్రక్కన ముక్కలు ముక్కలై పడి ఉన్న నల్లత్రాచును చూడగానే క్షణంలో సంగతి అర్థమైంది అతనికి- ముంగిస..! బాధతో, ఉద్రేకంతో గుండెలు బాదుకుంటూ, తల పట్టుకుంటూ, అరచేత్తో నుదుటిని కొట్టుకుంటూ అతను "ఈ నాటి వరకూ ఎక్కడా, ఎవ్వరికీ అంటని పాపం ఈ రోజున నాకు అంటిందే!' అని చాలా సేపు ఏడ్చాడు.

కాబట్టి, ఏ పనినైనా సరే, జాగ్రత్తగా ఆలోచించకుండా త్వరపడి చేయకూడదు" అని చెప్పింది దూరదర్శి.

దూరదర్శి మాటలు విన్న నెమలిరాజు చిత్రవర్ణుడు కొంచెం తగ్గి, ఆలోచించింది. అయినా ఒకింత సందేహంతో "మంత్రివర్యా! మీరు ఇప్పుడు చెప్పినదంతా సరైనదిగానే తోస్తున్నది. కానీ శత్రువు ఒకడు దండయాత్రకు వచ్చి, మన నగరాన్ని ఆక్రమించడం కోసం ఒకవైపున యుద్ధభేరి మ్రోగిస్తుండగా, మరొకవైపున "దీర్ఘంగా ఆలోచించి కానీ ఏ పనీ మొదలుపెట్టరాదు" అని చెప్పుకుంటూ ఆలస్యం చేయటం సరిగా అనిపించటం లేదు నాకు.

మన ఆలోచన తెగేసరికి నగరం అంతా నాశనమైపోవచ్చు కదా! కాబట్టి, వచ్చి పడిన ఈ ఆపదను ముందుగా తొలగించుకోవాలి- హిరణ్యగర్భుడి సంగతి తర్వాత చూసుకుందాములే, అతనిది ఏమి గొప్ప పని? నాకైతే- పోయి, సైన్యాన్ని సమకూర్చుకొని, శత్రువును ఎదుర్కొని, పోరాటం చేయటాన్ని మించిన మార్గం వేరే ఏదీ ఉన్నట్లు తోచదు. అయినా నీ మనసుకు ఇతర ఉపాయాలేమైనా తోస్తే చెప్పు.

ఆలోచించి, అందరికీ సమ్మతం అయిన మార్గాన్నే అవలంబిద్దాం" అన్నది.



యమధర్మరాజు: చిత్రగుప్తా! ఈ పాపి చిట్టా చూడు- తక్షణమే శిక్ష విధిస్తాను!

చిత్రగుప్తుడు: రెండు రోజుల నుండి సర్వర్ డౌన్ ప్రభూ! తమరికి ముందే మనవి చేశాను. నెట్ పునరుద్ధరింపబడే వరకూ వీడినేమీ చేయలేం.

సేకరణ: అలివేలమ్మ, చెన్నేకొత్తపల్లి



అత్యాశ

రచన: జి.యం. వరప్రసాద్, తొమ్మిదవ తరగతి, జడ్.పి.హెచ్.స్కూల్, నాగసముద్రం, అనంతపురం జిల్లా

నాగ సముద్రంలో నివసించే శివ, హరి ఇద్దరూ మంచి స్నేహితులు. ఇంట్లోను, బడిలోను వీలైనంత అల్లరి చేయటం, లేని పోని కష్టాలు తెచ్చుకోవటం వాళ్ళకు అలవాటు.

ఒకసారి జనవరి 26 న వాళ్ళ బడిలో రోజు గణతంత్ర్య దినోత్సవం జరిగింది. 1947 లో మనకు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా రాజ్యాంగం తయారయ్యేందుకు సమయం పట్టిందనీ, 1950 జనవరి 26 నుండీ మన రాజ్యాంగం అమలులోకి వచ్చిందనీ చెప్పారు బళ్ళో. హరికి, శివకి ఆ సంగతులేవీ పెద్దగా అర్థం కాలేదు గానీ, కార్యక్రమం అయిపోగానే బడి వదిలేస్తారని మటుకు తెలిసింది.

"ఒరే! బడి వదలగానే ఏం చేద్దాం?" గుసగుసగా అడిగాడు హరి.

"ఇంటికి పోవద్దు- వేరే ఎక్కడికైనా పోదాం,

ఎటు?" అన్నాడు శివ.

"రాజుగారి తోటలో మామిడి కాయలకు వెళ్దాం" అన్నాడు హరి.

"అమ్మో! తోటమాలి ఉంటాడురా! పట్టుకున్నాడంటే ఊళ్ళో రచ్చ రచ్చ చేస్తాడు" భయంగా అన్నాడు శివ.

"ఏం కాదులే! నా దగ్గర ఓ ప్లానుంది!" భరోసా ఇచ్చాడు హరి.

బడి వదలగానే ఇద్దరూ రాజుగారి తోట దగ్గరికి పరుగు లంకించుకున్నారు.

తోటకు అన్నివైపులా కంచె ఉంటుంది. రోడ్డుకు దగ్గర్లోనే పెద్ద గేటు కూడా ఉంటుంది. సామాన్యంగా తోటమాలులు ఆ గేటు దగ్గర్లోనే ఎక్కడో పని చేసుకుంటూ ఉంటారు. హరి నేరుగా ఆ గేటు దగ్గరికి దారి తీశాడు-

"తోటమాలి గారూ! తోటమాలిగారూ!" అర్జంటుగా అరిచాడు.

"ఎవరది?!" తోటమాలి గేటు ప్రక్కనుండే అరిచాడు.

"తోటమాలి గారూ! మా అక్కకు చాలా కడుపు నొప్పిగా ఉన్నదటండి. మా అమ్మ పంపించిందండి. మిమ్మల్ని అడిగి రెండు మామిడి కాయలు కోసుకు రమ్మన్నదండి" చాలా జాలిగా మొహం పెట్టి చెప్పాడు హరి.



తోటమాలి ఇద్దరికేసీ చూశాడు ఒక క్షణం-

"సరే- పోయి కోసుకోండి- అటువైపున మామిడి చెట్లకు కొంచెం పెద్ద కాయలు ఉన్నాయి. మీరు మంచి పిల్లల్లాగున్నారు- ఊరికే బయటినుండి రాళ్ళు వేయలేదు; కల్ల దూకి రాలేదు. అందుకనే ఒప్పుకుంటున్నాను. పోయి ఓ నాలుగు కాయలు కోసుకొని వచ్చేయండి, చకచకా" అన్నాడు.

"చూశావా?" అన్నట్లు కళ్ళతోటే సైగ చేసి

తోటమాలి చూపినవైపు దారితీసాడు హరి. శివ చిరునవ్వులు నవ్వుకుంటూ అతన్ని అనుసరించాడు.

తోటలో మామిడికాయలు గుత్తులు గుత్తులుగా వ్రేలాడుతున్నాయి. అన్నీ చేతికందేంత ఎత్తులోనే ఉన్నాయి! పిల్లలు ఇద్దరూ గబగబా చాలా కాయలు కోసేసారు.

"పోదాం పదరా! తోటమాలి వస్తే కష్టం" వెనక్కి చూస్తూ అన్నాడు శివ.

"ఊరుకోరా, ఏం కాదు! వాడికి అసలు మనం వచ్చిన సంగతే గుర్తుండదు. తీరికగా కావలసినన్ని మామిడి కాయలు కోసుకొని కంచె అవతలికి పెట్టుకుందాం. బయటికి వెళ్ళాక అటునుండి అటే వాటిని ఎత్తుకు పోవచ్చు" అని మరిన్ని కాయలు కోసాడు హరి.

ఇద్దరూ తాము కోసిన మామిడికాయలను బయట కల్లలోకి చేరవేసారు.

"పోదాం పదరా!" అన్నాడు శివ. తోటమాలి వచ్చేస్తాడని వాడికి మా చెడ్డ అనుమానంగా ఉంది.

"ఆగు- ఒకసారి అటువైపుకు పోయొద్దాం-" కుడివైపున ఊరిస్తున్న అరటి తోట వైపుకు చూపిస్తూ అన్నాడు హరి. అరటితోట కాపుకు వచ్చి ఉన్నది. గెలలనిండా పండ్లు-అద్భుతంగా ఉన్నాయి. "ఒక్క గెల కోసుకొని వెళ్ళిపోదాం" అంతే.

"వద్దులేరా! అనబోయిన శివ నోరు చటుక్కున మూతపడింది- "ఒక్క గెలనే కదా" అని అన్ని దిక్కులకూ చూశాడు. తోటమాలి దగ్గర్లో లేడు. "సరే" అని తలూపి, తనే ముందుకు దారి తీశాడు.

నేల నిండా అరటి ఆకులు, పట్టలు పడి ఉన్నాయి. పిల్లలిద్దరూ వాటిని తొక్కుకుంటూ అరటితోటవైపుకు దారి తీసారు. అకస్మాత్తుగా ఏమైందో ఏమో-వాళ్ళ కాళ్ళ క్రింది నేల కదిలింది! మరుక్షణం ఇద్దరూ ఓ బావిలో పడిపోయి ఉన్నారు! వాళ్ల హడావిడిలో ఇద్దరూ ప్రక్కనే ఉన్న బావిని గమనించలేదన్నమాట.

ఇంకేముంది? ఇద్దరూ ఏడ్చారు, మూలిగారు, కేకలు పెట్టారు, గిజగిజలాడారు.

"వీళ్ళు ఇంకా రాలేదేమి?" అనుకుంటున్న

తోటమాలి వాళ్ళ అరుపులు విని అటు పరుగెత్తుకొని వచ్చాడు. "ఇటువైపుకు ఎందుకు వచ్చార్రా మీరు?!" అని గుడ్లు ఉరిమాడు. అయితే మాత్రం ఏముంది? వీళ్ళు కదిలే పరిస్థితిలో కూడా లేరాయె! చివరికి వీళ్ళ గతి చూసి అతను మిగిలిన తోటలవాళ్ళను కూడా పిలిచాడు. అందరూ కలిసి తాళ్ళు, కట్టెలు అన్నీ వాడుకొని వీళ్ళను బయటికి లాగారు.

హరి, శివలకు ఇద్దరికీ కాళ్ళు చేతులు అన్నీ దోక్కుపోయాయి. ఒకటి రెండు చోట్ల ఎముకలు కూడా విరిగాయి. అందరూ వాళ్ళని బండికెత్తి నేరుగా ఇంటికి పంపారు. ఈ గందరగోళంలో వాళ్ళు కోసిన మామిడి కాయలన్నీ ఎక్కడికి పోయాయో ఎవ్వరికీ తెలీదు.

ఇక ఆ తర్వాత వాళ్ళకి వైద్యం చేయిస్తూ ఇంట్లోవాళ్ళు తిట్టని తిట్టు లేదు!



పొరపాటు!

రాణి. రైల్వే ఉద్యోగిని పెళ్లాడి పొరపాటు చేశాననిపిస్తోంది.

పక్కింటి ఆమె: ఏ ఏమైంది?

రాణి: చెప్పిన టైమ్‌కు ఒక్కనాడు ఇంటికి రావటం లేదు చెప్పింది రాణి.

అలివేలమ్మ, చెన్నేకొత్తపల్లి

చాక్‌పీసు ప్రేమ!

లెక్కల అయ్యవారు: పిల్లలూ! ఈ అభ్యాసంలోఎన్ని లెక్కలు ఉన్నాయి?

గోపి: చాలా ఉన్నాయి సార్!

లెక్కల అయ్యవారు: మరయితే ఒక్క లెక్క చేస్తువురా, గోపి

గోపి: ఒక్క లెక్క కాదు సార్, అన్ని లెక్కలూ ఒకేసారి చేస్తా. బోర్డు తక్కువ అయినా పర్లేదు; చాక్‌పీసులు మాత్రం ఎక్కువగా ఇప్పించండి సార్!

సి. రెడ్డి శ్రీను 7వ తరగతి, పివిఆర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, టి గుండువారిపల్లి.



భలే మేకు

రచన: జి. రాజేశ్వరి. ఐదవ తరగతి, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, కంకణాల పల్లి, ప్రకాశం జిల్లా.

అనగనగా ఒక ఊరిలో ఒక రంగయ్య ఉండేవాడు. ఒకసారి ఆ రంగయ్యకు ఓ పెద్దాయన ఓ కేలెండర్ ఇచ్చారు. రంగయ్య దాన్ని తెచ్చి ఇంట్లో మేకుకు తగిలించి, "బట్టలు కొనుక్కుంటే నయం" అనుకొని త్రిపురాంతకం వెళ్లాడు.

అప్పుడు వాళ్ల ఇంట్లోకి ఓ కుక్క దూరింది. దూరగానే దానికి రంగుల రంగుల కేలెండరూ, దాన్ని తగిలించిన మేకూ కనిపించాయి. దానికి ఆ కేలెండరు బాగా పరిచయం ఉన్నట్లు అనిపించి, "దగ్గరికి వెళ్లి చూద్దాం" అని అక్కడికి వెళ్ళింది.

అది తన దగ్గరికి రాగానే మేకుకు చాలా సంతోషం వేసింది- "కుక్కా! బాగున్నావా?" పలకరించింది మేకు. "ఏదో, ఉన్నాను. నువ్వు బాగున్నావా?" అంది కుక్క.

"నాకేమి? నేను మేకులాగా ఉన్నాను. చాలా బాగున్నాను " అన్నది మేకు.

"మీ క్యాలండర్ అచ్చంగా మా పాత ఇంట్లో క్యాలండరు లాగే ఉన్నది. మీ యజమాని

ఫొటో ఉందా ఎక్కడైనా?" అడిగింది కుక్క.

"అదిగో, అక్కడ వ్రేలాడుతున్నది ఆయన ఫొటోనే" అంది మేకు.

"అయ్యో! మీ రంగయ్య చాలా చెడ్డవాడే, పాపం నీది కూడా నాలాంటి కష్టపు బ్రతుకేనన్నమాట!" అంది కుక్క రంగయ్య ఫొటోని చూస్తూ.

"ఏమీ లేదు. రంగయ్య చాలా మంచోడు. నీకెందుకు అట్లా అనిపించింది?" అడిగింది మేకు, ఆశ్చర్యపోతూ.

"మా యజమాని గురించి నీకు తెలీదు కదా, అచ్చం రంగయ్య లాగే ఉంటాడు. చాలా చెడ్డవాడు. మీ రంగయ్య కూడా ఆయన లాగే చాలా చెడ్డవాడు అయిఉంటాడు. ఇంకేమి?" అంది కుక్క.

"ఏమీ లేదే! రంగయ్య నన్ను ఏమీ అనడే?!" ఆశ్చర్యపోయింది మేకు.

"నువ్వైతే మేకువు- సరే. మరి మీ ఇంట్లో కుక్కను బాగా చూసుకుంటాడా, రంగయ్య?" అడిగింది కుక్క.

"మా ఇంట్లో కుక్కే లేదు అసలు! అదే ఉంటే నువ్వు ఇక్కడ ఎట్లా నిలబడేదానివి?!" నవ్వింది మేకు.


"అదేంటి- రంగయ్య, మా యజమాని ఒకేలాగా ఉన్నప్పుడు, మీ ఇంట్లో కూడా నాలాంటి కుక్క ఉండాల్సిందేనే?!" అంది కుక్క, కుక్కలాగా ఆలోచించి.

మేకుకు ఏమనాలో తెలియలేదు. అప్పుడు గుర్తొచ్చింది- రంగయ్య బిడ్డ రోజూ చదివే పద్యం ఒకటి అప్పుడు అర్థమైంది దానికి.

కుక్కని చూసి నవ్వుతూ అది చెప్పింది- "చూడు కుక్కా, ఉప్పు, కర్పూరం చూసేందుకు ఒకేలాగా ఉంటాయి. కానీ వాటి రుచులు పూర్తిగా వేరుగా ఉంటై. అట్లాగే మనుషులు కూడా-చూపులకు ఒకేలాగా ఉన్నా, మనసులు, ప్రవర్తన మటుకు వాటి ఇష్టం వచ్చినట్లు అవి ఉంటాయి. అందుకని మనిషుల్ని పరిశీలించకుండా, వాళ్ల రూపాన్ని బట్టి 'మంచి-చెడ్డ' అని చెప్పలేం తల్లీ!" అంది.

మామూలుగా అయితే కుక్క ఏదో అనేదే గానీ, పద్యం విన్నాక ఇంక అనేందుకు ఏమీ లేక,"బాబోయ్! ఇది భలే మేకు" అనుకుంటూ వెళ్లిపోయింది.






సాహస వీరుడు నిఖిల్

రచన: నిఖిల్, రిషీ వ్యాలీ స్కూల్

నిఖిల్ వాళ్ళ ఊరు సముద్ర తీరంలో ఉంది. మరొకవైపున దగ్గర్లోనే పెద్ద అడవి. సముద్రంలో చేపలు పట్టటానికి వచ్చే జాలరులు, వాళ్ళకు అవసరమైన చెక్క, వలలు, పడవలు తయారుచేసే సామానులు వగైరాలు అమ్మే వ్యాపారులు, చేపలు కొనుక్కునేందుకు వచ్చే వాళ్ళు, రవాణా వాహనాలు- ఎప్పుడూ వందలమంది రోడ్లమీద, కూడళ్ళలోను ఉండే ఊరది. నిఖిల్ బడికి వెళ్దామని బయలుదేరాడు ఒక రోజున. మామూలుగా ఎప్పుడూ నడిచే దారిలోనే నడుస్తూ పోతున్నాడు. ఊరంతా రోజూ మాదిరే హడావిడిగా ఉంది.

అకస్మాత్తుగా పెద్ద ఎత్తున హాహాకారాలు మొదలయ్యాయి. జనాలంతా ఎటుపడితే అటు పరుగు పెట్టటం మొదలు పెట్టారు. దుకాణాలవాళ్ళు గబగబా షట్టర్లు మూసేయసాగారు. ఎవరో మధ్య వయసాయన ఒకడు పరుగు పెట్టలేక క్రింద

పడిపోయి, వెంటనే గబుక్కున లేచి, వెనక్కి తిరిగి చూసి, పంచెను ఎత్తి పట్టుకొని వణుక్కుంటూ పరుగు తీశాడు. బడి ధ్యాసలో ఉన్న నిఖిల్‌కి ఇదేమీ అర్థం కాలేదు. కొంచెం సేపటికి ఊరికే వెనక్కి తిరిగి చూసి అతను కొయ్యబారిపోయాడు-



నిఖిల్ వెనకనే నిలబడి, అతన్ని పట్టుకునేందుకు చేతులు చాచి ఉన్నది- ఓ వింత మృగం! దానికి రెండు తలలున్నై! నాలుగు కళ్లు, నాలుగు చేతులు, నాలుగు కాళ్లు, రెండు కొమ్ములు! దాని కళ్ళు చింత నిప్పుల్లాగా ఎర్రగా మెరుస్తున్నాయి. డైనోసార్ల లాంటి బరువైన శరీరం. అది నడిచినంత మేర రోడ్డు గుంతలు పడిపోయింది. దాని తాకిడికే కాబోలు, వెనక రోడ్డు వారగా ఉన్న భవంతులన్నీ కుప్ప కూలిపోయి ఉన్నాయి. వాటిలో ఉండిన మనుషులు ఏమైనారో!

వింతమృగం నోరు తెరిచింది. దాని పళ్ళు గారపట్టినట్లు పచ్చగా. దాని నాలుక పొడవుగా ఉండి, చివర్లో చీలి ఉన్నది. తాడులాంటి ఆ నాలుక అటూ ఇటూ ఊగుతుంటే, ఊపిరి సలపనంత గబ్బు వాసన ఒకటి నిఖిల్‌ని కమ్ముకున్నది. వింతమృగం చేతులు నిఖిల్ చొక్కాకు తగిలాయి. మరుక్షణం నిఖిల్‌కి చలనం వచ్చింది. తన పుస్తకాల సంచీతో దాని చేతిని విసిరి కొట్టి పరుగు లంకించుకున్నాడతను. పుస్తకాల సంచీ బరువు దానికి ఒక లెక్క కాదు- కానీ విసురుగా వచ్చి పడ్డ సంచీ బరువుకి దాని చేతులు నిఖిల్‌ని వదిలేశాయి. అయితేనేమి, మరుక్షణంలో అది తేరుకొని వేగంగా నిఖిల్ మీదికి రాసాగింది.

నిఖిల్ వేసే ఐదడుగులూ దానికి ఒక్క అడుగుతో సమానం! త్వరలోనే అది మళ్ళీ నిఖిల్‌ను చేరుకోగలిగింది. ఈసారి వాడి

వెంట పరుగెత్తుతూనే వాడి వైపుకు తన చేతులు చాచిందది. అయినా అదృష్టం నిఖిల్ పక్షాన ఉన్నట్లుంది. సరిగ్గా అదే క్షణంలో ఎడమవైపున ఉన్న సందులోకి మళ్ళాడు వాడు. "సన్నటి సందులోకి వస్తే ఈ జంతువు ఎక్కడో ఒకచోట ఇరుక్కుపోతుంది.." అనుకుంటూ. వింతమృగం వేగాన్ని పెంచుకుంటూ వాడి వెంట పడింది. అడ్డు వచ్చిన భవంతులను చేతులతో మట్టుగిస్తూ పోయింది. ఊళ్ళో ఉన్న కరెంటు తీగలు అన్నీ దానికి చుట్టుకున్నాయి. వాటిలోంచి రపరపా వెలువడిన మెరుపులు శబ్దాలు దాన్ని చికాకు పెట్టినట్లున్నాయి. అది మరింత రెచ్చిపోయింది. అంతలోనే కరెంటు తీగ ఒకటి దాని ముఖానికి తగులుకున్నది. బహుశ: దానికి ఇప్పుడు రెండు కళ్ళు పని చేయట్లేదేమో- గుడ్డిదాని మాదిరి, ఊరిమీద పడిందది. ఊళ్ళో ఉన్న జనాలంతా గగ్గోలెత్తిపోయారు. అయినా అది నిఖిల్‌ని వదలలేదు. వాడు ఎటుపోతే అటే పోయిందది!

నిఖిల్ పరుగెత్తుతూనే ఆలోచించాడు- "ఇది వచ్చిన దిక్కును చూస్తే ఇదేదో అడవి జంతువు అనిపిస్తున్నది. దాని శరీర నిర్మాణం కూడా, నీటి ప్రాణి మాదిరి లేదు. ఏదైనా ఉపాయంతో దీన్ని సముద్రంలోకి తీసుకుపోతే..?" అని.

వెంటనే అతను ప్రక్కకు తిరిగి సముద్రం వైపుకు పరుగు పెట్టాడు. వింతమృగం ఏమాత్రం ఆలోచించలేదు. తనకు అడ్డు వచ్చిన చెట్లనీ, స్తంభాలనీ, భవంతులనీ మొద్దుల్లాంటి తన చేతులతోటీ, కాళ్ళతోటీ చరుచుకుంటూ, తన్నుకుంటూ నిఖిల్ వెంట పడి పోయిందది. సముద్ర తీరం చేరుకున్న నిఖిల్‌కి అప్పుడే సముద్రంలోకి బయలు దేరుతున్న పడవ ఒకటి కనబడింది. "ఏయ్! ఆగండి! ఆగండి!" అని ఒక్క పరుగున పోయి ఆ పడవలోకి దూకాడతను. పడవలో ఒక జాలరివాడు మాత్రం ఉన్నాడు. నిఖిల్ వెనకనే ఇసుకలో పరుగు పెట్టుకుంటూ, గస పోసుకుంటూ వస్తున్న వింతమృగాన్ని చూసి అతను నిశ్చేష్టుడైపోయాడు.


"పద- పద- వేగంగా పోవాలి" అని నిఖిల్ అతని చేతిలో ఉన్న తెడ్డునొకదాన్ని లాక్కొని తనూ తెడ్డు వేయసాగాడు. పడవ వేగంగా ముందుకు పోయింది. నీళ్ళ అంచుకు రాగానే వింతమృగం ఒక్కసారిగా ఆగిపోయి ఓ వింత అరుపు అరిచింది. నిజంగానే దాని కళ్ళు రెండు- కాదు కాదు- నాలుగు కళ్ళూ- పనిచేయట్లేదిప్పుడు! ఆ కళ్ళలో ఏవో ఊచలు గుచ్చుకుపోయి ఉన్నాయి. అయినా దాని ముక్కు పనిచేస్తూనే ఉంది- నిఖిల్ వాసన దానికి తెలుస్తూనే ఉన్నది! అలల శబ్దం దాని చెవులకు వినబడుతూనే ఉన్నది! ఒక్క నిముషంపాటు అటూ ఇటూ తిరిగిన వింత మృగం ఇంక ఎక్కువ ఆలస్యం చేయకుండానే సముద్రపు నీళ్ళను నెట్టుకుంటూ ముందుకు నడిచింది!

పడవలో కూర్చున్న నిఖిల్‌కి మతిపోయినట్లు అయ్యింది. "ఇది ఉభయ చరమా, నీళ్ళలోనూ, నేలమీద కూడానూ బ్రతుకుతుందా, కప్పలాగా..?" అతని ఆలోచనలు కనిపెట్టినట్లు పడవలో ఉన్న జాలరి అన్నాడు- "లేదులే, ఇది నీళ్లలో బ్రతికే జీవి కాదు- అడవిలోంచి వచ్చిన ప్రాణి. దీన్ని లోతైన సముద్రంలోకి తీసుకెళ్ళి నీళ్ళలో పడేస్తే దాని పని అవుతుంది" అని.

పడవ సముద్రంలో ముందుకు పోయింది. దాని వెనకనే సముద్రంలో పడుతూ లేస్తూ పోయింది వింత మృగం. వేగంగా ఎగిసి పడుతున్న అలలతో పడవ ముందుకు పోతున్నట్లే పోతున్నది, మళ్ళీ వెనక్కి పడుతున్నది. చూస్తూ చూస్తూండగానే వింతమృగం బాగా దగ్గరికి వచ్చింది. "ఇప్పుడెలా?" అనుకున్నాడు నిఖిల్. సరిగ్గా ఆ సమయాని పెద్ద కెరటం ఒకటి వచ్చి పడవను పూర్తిగా పైకి లేపింది. "దూకు! పారిపో!" అని జాలరి వాడు పడవమీదినుండి ఒక్క ఉదుటున సముద్రంలోకి దూకేశాడు. 'అలా చేయాలా, వద్దా' అని ఒక్క క్షణకాలం పాటు ఆలోచించాడు నిఖిల్. అంతలోనే వెనక ఉన్న వింతమృగం పెద్దగా గర్జిస్తూ ఒక్క ఎగురు ఎగిరింది. ఇంక ఆలోచించుకునేందుకు ఏమున్నది? అది పడవలోకి వచ్చి పడే లోగా నిఖిల్ పడవనుండి నేరుగా సముద్రంలోకి

దూకేశాడు. వాడి వెనకనే ఉవ్వెత్తున లేచిన ఓ కెరటం వాడిని ఎత్తుకెళ్ళి సముద్రంలోనే మరో వైపున పడేసింది.

ఆ మృగం తన వెనకే వస్తూందని భయపడ్డాడు నిఖిల్. అయితే వాడు వెనక్కి తిరిగి చూసే సరికి పడవ సముద్రంలో ఇంకా లోపలికి కొట్టుకు పోయి ఉన్నది!



వింతమృగం పడవలో తన్నుకులాడుతున్నది! పడవకు రంధ్రం పడినట్లున్నది- చూస్తూ చూస్తూండగానే వింతమృగంతో సహా పడవ సముద్రంలో మునిగిపోయింది!

కొంతసేపు దానివంకే చూసిన నిఖిల్ మెల్లగా ఒడ్డుకు ఈదుకొచ్చాడు. సముద్రతీరంలో గుమిగూడిన ఊరి ప్రజలు వింతమృగం సముద్రంలో మునిగిపోవటాన్ని కళ్ళారా చూశారు. నిఖిల్‌ను మెచ్చుకొని చప్పట్లు కొట్టారు. వాడిని మెడమీద ఎక్కించుకొని డప్పులు కొడుతూ ఊరంతా మెరిమిని తిప్పి జాతరలాగా చేశారు.

ఆ మరుసటిరోజు పేపర్లో ఫోటో కూడా వచ్చింది- 'సాహస వీరుడు నిఖిల్' అని!

పొడుపులు

రెండు స్తంభాల మీద తొట్టి
తొట్టి మీద గుండ్రాయి
గుండ్రాయి మీద గడ్డి
గడ్డిమీద రోడ్డు!
ఏంటి ఇది?

జవాబు మనిషి!

ముళ్ళలో పుట్టాను
ముళ్ళలో పెరిగాను
రంగూ వాసన నాసొత్తు
ఎవరిని, నేనెవరిని?

జవాబు :గులాబీ!

తెల్లని గుడి-
లోనికి వెళ్ళే దారి లేదు!
ఏమిటది?

జవాబు: గ్రుడ్డు!

ఒక్క అంటార్కిటికాలో తప్ప ప్రపంచంలోని అన్ని ఖండాలలోనూ పాములున్నాయి.



ఒక వెంగళప్ప కథ

తెనాలి రామలింగడి కథలు, మర్యాద రామన్న కథలు ఒక రకంవి అయితే, భట్టి విక్రమార్క కథలు, భోజరాజు సాలభంజికలకథలు మరో రకంవి. ఇవన్నీ ఒక ఎత్తు, పరరు మానందయ్యగారి శిష్యుల కథలు మరో ఎత్తు. ఈ కథలోని అంశాలన్నీ నిజానికి పరమానందయ్యగారవే, అయినా రెడ్డి శీను చెప్పినప్పుడు కొత్తగా విందాం, దానిదేముంది?

కథనం: C. రెడ్డి శీను, ఎనిమిదవ తరగతి, P.V.R.Z.P.H.పాఠశాల, గుండువారి పల్లె, అనంతపురం జిల్లా.

ఒక రోజున వెంగళప్ప వాళ్ల నాన్నతో కలిసి అంగడికి వెళ్లాడు. నాన్న బఠానీలు కొని పెట్టాడు. దుకాణాదారు బఠానీలు తూశాక, వెంగళప్ప తన దోసిలిని ముందుకు చాపాడు. దుకాణదారు కొంచెం తటపటాయిస్తుంటే వెంగళప్ప "ఇయ్యన్నా!"అన్నాడు. దుకాణదారు వాటిని తక్కెడలోంచి నేరుగా వెంగళప్ప చేతుల్లో పోశాడు.

వాటిని అట్లాగే తినేందుకు ప్రయత్నించాడు వెంగళప్ప. వాడి నోటిని చేరేలోగా బఠానీలు సగానికి సగం కింద పడిపోయాయి. అది

చూసి వాళ్ల నాన్న "ఒరే, నాన్నా! ఎవరన్నా ఏమన్నా ఇస్తే అలా చేతిలో పట్టుకోగూడదురా, జేబులో వేసుకోవాలి. అప్పుడు కదా, అవి భద్రంగా ఉండేది?! కొంచెం ఆలోచించాలి నాయనా" అని చెప్పాడు ముద్దుగా.

ఆ రోజునే వాళ్ల అమ్మ పూరీలు చేయాలనుకున్నది. చూడగా ఇంట్లో నూనె లేదు. ఆవిడ కొడుకును పిలిచి "ఒరేయ్! పోయి శెట్టిని అడిగి కొంచెం నూనె పోయించుకొని రా,పో!" అని గిన్నె ఇచ్చింది. వెంగళప్ప ఉత్సాహంగా పరుగుత్తుకుంటూ పోయి అంగడిలో నూనె పోయించుకున్నాడు.

వెనక్కి తిరిగి వస్తూంటే వాడికి అకస్మాత్తుగా గుర్తుకొచ్చింది- "ఎవరన్నా ఏదైనా ఇస్తే జేబులో వేసుకోవాలి, అప్పుడు కదా, అవి భద్రంగా ఉండేది?" అని వెంటనే గిన్నెలోని నూనెనంతా జేబులో పోసుకున్నాడు. నూనె అంతా కారిపోయింది.

ఇంటికి వెళ్ళాక వాళ్లమ్మ నెత్తీ నోరూ బాదుకున్నది- "పూరీలకు నూనె లేకపోగా, వాడి చొక్కాకున్న జిడ్డు వదిలించేందుకు కిలో డిటర్జెంటు పొడి అవసరమౌతుందే" అని.

ఒకసారి వాళ్ళ ఊళ్ళోకి బాతులు అమ్మే ఆయన వచ్చాడు. మాంసం తినేవాళ్లంతా ఆరోజున పోయి తమకు కావలసినన్ని బాతులు తెచ్చుకుంటున్నారు. "మనకి ఒక బాతును తీసుకురా పో" అని పంపింది వెంగళప్ప వాళ్లమ్మ.

వెంగళప్ప వెళ్ళి ఒక బాతును కొనుక్కున్నాడు. దుకాణదారు దాన్ని వీడి చేతికి ఇవ్వగానే అది రెక్కలు టపటపా కొట్టుకున్నది. వీడు బెదిరిపోయి దాన్ని వదిలేశాడు. బాతు ఒక్క ఎగురు ఎగిరి, అదృష్టం కొద్దీ దుకాణం లోపలికే పోయింది. దుకాణదారు దాన్ని మళ్ళీ పట్టుకొని తెచ్చి ఇస్తూ "ఒరే! ఇంతమాత్రం తెలీదురా?! పక్షుల్ని పట్టుకునేది ఎట్లాగ? మెడ దగ్గర పట్టుకుంటే అవి కిక్కురుమనకుండా ఉంటాయి- ఇలాగ మెడ పట్టుకో" అని బాతును వెంగళప్ప చేతికి అందించాడు.

ఆ రోజు సాయంత్రం వాళ్ల నాన్న ఇంటికి

వచ్చి "ఒరే! సుబ్బారావు మామయ్యగారింట్లో కోళ్ళు ఎక్కువై పోయి, మరీ అల్లరి చేస్తున్నాయట. మనం పెంచుకునేందుకు ఒక రెండు కోళ్ళు ఇస్తానన్నాడు. వెళ్ళి పట్టుకురా, పో" అని పంపాడు వెంగళప్పను.

వెంగళప్ప రెండు కోళ్ళను దొరకపుచ్చుకొని, వాటి మెడలు పట్టుకొని ఎత్తుకొచ్చాడు. ఇంటికొచ్చేసరికి అవి కాస్తా చచ్చిపోయి ఉన్నాయి! "వాళ్ళింట్లో ఇవి బానే ఉన్నాయి నాన్నా!" అన్నాడు వెంగళప్ప బాధపడిపోతూ.

"అవునురా, మెడ పిసికితే కోళ్ళు ఎలా బ్రతుకుతాయి, కాళ్ళు కట్టేసి తల క్రిందులుగా పట్టుకొని తేవాలిగాని?!" అన్నాడు నాన్న, మరింత విచారంగా.

వెంగళప్ప తల తిరిగింది ఈసారి. "అబ్బ!ఈ ప్రపంచాన్నంతా అంతా బలే తిక్కగా చేశాడు దేవుడు. దీన్ని అర్థం చేసుకునేది ఎలాగో, ఏమిటో" అనుకున్నాడు కలవరపడుతూ.



సూర్యాస్తమయమేనా?! భావుకత!

కొండకోనల్లో నవ్వుతూ, తుళ్ళుతూ పరిగెడుతున్న సెలయేరు

కాలుజారి లోయలో పడిపోయింది. అది చూసి ఆకుల చాటు

సూరీడు పొట్ట చెక్కలయ్యేలా నవ్వుతూ పడమటి కొండల వెనక్కి పడిపోయాడు..

Y. బాలాజి, ఎనిమిదవ తరగతి, P.V.R.Z.P.H.పాఠశాల.

పక్కింటి ఆమె (ఆశ్చర్యంగా) : వదినా, అన్నయ్య గారు చీకట్లో కూడా వంటింటి పనులన్నీ చక చకా చేసేస్తున్నారే!

రాధ: ఆయనపోటో గ్రాఫర్ కదా, డార్క్ రూములో పనిచేయడం అలవాటులే!

అలివేలమ్మ, చెన్నేకొత్తపల్లి

అంతరంగమందు అపరాధములు చేసి- మంచివానివలెను మనుజుడుండు

ఇతరులెరుగకున్న ఈశ్వరుడెరుగడా, విశ్వదాభిరామ వినురవేమ?

వేమా!



స్కూటీనెక్కిన పిల్లి

కొత్తపల్లి 75లోఇచ్చిన బొమ్మకు 'కథలు ' రాసి పంపారు అరవింద స్కూలు పిల్లలు! వాటిలో మాకు నచ్చిన మూడు కథలు- ఇవిగో ! ఈసారి బొమ్మకు సరిపోయే కథనొకదాన్ని మీరూ రాసి పంపండేం...!

ఒకటో కథ

"మన దేశ ప్రజలకు ఒక లక్షణం ఉంది- మన దగ్గర వంద ఉన్నా పక్కవాడి నూటఒకటే నచ్చుతుంది " అంటూ కథ రాసింది సాయి ప్రియ.

రచన: జెముడుగాని సాయి ప్రియ, ఎనిమిది లిల్లి, అరవింద హైస్కూల్, కుంచనపల్లి, కృష్ణాజిల్లా.



పచ్చటి ఓ గ్రామంలో ఒక మూలన క్యాటీ అనే పిల్లి, ఇంకో మూలన డాగీ అనే కుక్క ఉండేవి.

ఆపదలో ఉన్న వారిని కాపాడే స్వభావం డాగీది. తన స్నేహితులందరికీ సాయం చేసేదది; వాళ్ల కోరికలు తీర్చేది. అయితే క్యాటీది మటుకు స్వార్థం; అందరినీ అనుమానించే తత్వం- ఇతరుల చేత

పనులు చేయించుకునేది; కానీ అవసరానికి ఎవ్వరికీ సాయపడేది కాదు.

డాగీకి ఊళ్ళో తిరగటం అంటే చాలా ఇష్టం. దాని సంగతి తెలిసిన యజమాని దానికి ఒక స్కూటీ కొనిపెట్టాడు. ఆ స్కూటీనెక్కి, అది రోజులో అనేకసార్లు ఊళ్ళోకి వచ్చేది. యజమాని ఇంట్లో ఏ సామాను కావాలన్నా దానికో చీటీ రాసిచ్చి పంపేవాళ్ళు. అది ఎంచక్కా పనులు చేసుకొని తిరిగి ఇంటికి పోయేది.

డాగీని చూసీ చూసీ క్యాటీకి కూడా స్కూటీ అంటే మోజు పట్టుకున్నది. "అట్లా స్కూటీలో బుర్రు బుర్రున తిరిగితే ఎంత బాగుంటుంది! నాకూ ఓ స్కూటీ ఉంటే బాగుండును- డాగీకే ఎందుకు, ప్రత్యేకంగా?!" అనుకోవటం మొదలు పెట్టిందది.

ఒక రోజున క్యాటీ అటువైపుగా వెళ్లుతూంటే రోడ్డు ప్రక్కనే ఓ ఇంటి ముందు ఆగి ఉన్న స్కూటీ కనిపించింది. క్యాటీ దాని దగ్గరకెళ్ళి ఉత్సాహంగా అటూ ఇటూ చూసింది- డాగీ ఎక్కడా కనిపించలేదు. దాంతో దాని ఉత్సాహం మరింత ఎక్కువైంది. మెల్లగా స్కూటీ మీదికి ఎక్కి కొంచెం సేపు పడుకున్నది; లేచింది; సీటు మీద ఎగిరింది; దూకింది; గంతులు వేసింది- అయినా ఇంకా డాగీ రాలేదు.

అప్పుడు చూస్తే స్కూటీకి తాళంచెవులు తగిలించే ఉన్నాయి! క్యాటీ ఉత్సాహం ఉరకలు వేసింది. ఒకవైపున "నాకు కాళ్లు అందవేమో.." అని అనుమాన పడింది. "అయినా ఏం కాదులే, దీనిలో ఏమున్నది? డాగీ చేయగలిగే పనిని నేను మాత్రం ఎందుకు చేయలేను?" అనుకొని, స్కూటీ ఇంజను స్టార్టు చేసి, స్టాండు తీసి, ముందుకు నడిపింది! కొంచెం దూరం వెళ్ళిందో, లేదో- ఢమాలున పడింది- దాని మీదికొచ్చి పడింది స్కూటీ!

ఆ శబ్దం విని, ఎక్కడినుండో పరుగున వచ్చింది డాగీ. పాపం, క్యాటీని ఆ స్కూటీ మీదే ఎక్కించుకొని నేరుగా ఆస్పత్రికి పరుగు పెట్టించింది!

మనవి కాని వస్తువులమీద మోజెందుకు, చెప్పండి?!

రెండో కథ

"మార్జాల కష్టాలా, మజాకా?!" అంటున్నాడు సాయినాథ...
రచన: చాగంటి శివ సాయినాథ్ రెడ్డి, అరవింద హైస్కూల్.

స్కూటీ మీద కూర్చున్న పిల్లి చెబుతున్నది-

అబ్బా! ఏంటండీ, మంచి నిద్ర చెడగొట్టారు? ఏంటీ, ఫోటోలు తీసుకుంటున్నారు? మరీ అంత అందంగా ఉన్నానా? సర్లే, ఈ ఫోజుతో ఒక ఫోటో తీసుకోండి పర్లేదు. నేను ఏమీ అనుకోనులెండి.

ఏంటీ, నేను ఇక్కడ ఎందుకు పడుకున్నాను అనేగా, మీ సందేహం? ఏం లేదండి- ఈ మధ్య మా ఇంట్లో నాకు ప్రశాంతత లేనే లేదు! ఏం చెప్పమంటారండీ, కనబడితే చాలు- "ఇట్లానా ఉండేది, నా బిడ్డ అంటే ఎంత అందంగా ఉండాలి?! ఇట్లా అయితే ఇంక నీకు సంబంధాలు దొరికినట్లే" అని మేకప్ కొడతారు, మా అమ్మగారు.

"ఒక్క ఎలుకనూ చంపకుండా ఖాళీగా ఉన్నావు, కనీసం ఇప్పుడైనా 'పిల్లి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హంటింగ్‌లో' చేరచ్చు కదా. కనీసం ఒక డిగ్రీ అన్నా ఉంటే, వచ్చేవాళ్ళకూ మర్యాద!" అని గోల చేస్తున్నారు నాన్నగారు.

అందులో చేరి హంటింగ్ నేర్చుకొని తర్వాత ఇంకేదో ఉద్యోగం వెలగబెట్టాలట! అక్కడేమో పూర్తిగా మాంసాహార భోజనం పెడతారు- అంటే ఎవరికి వాళ్ళు వెళ్ళి ఎలుకల్ని వేటాడుకొని తినాలి! మరి నేనేమో పూర్తిగా శాకాహారిని- అంటే కేవలం పాలు, మీగడల మీద బతికేదాన్ని: ఏం చేయమంటారు, డబ్బుకోసం ఇష్టంలేని పని చేయడం నా మనస్సుకు నచ్చదు!



మా తమ్ముళ్ల గురించి అడుగుతున్నారా, ఏం చెప్పను? నేను తెచ్చిన పాలే త్రాగి, నా మీది దూకి ఆడుకుంటారు వాళ్ళు. ఇంక నా చెల్లెలేమో తనకు ఒక మంచి పిల్లిగాడిని

తీసుకొచ్చి పెళ్లి చేయమని గొడవ. "ముళ్లులేని చేపలకూర తెచ్చిపెట్టురా, నాకు? చెబితే వినవేమి?" అని మళ్ళీ మళ్ళీ చెబుతూనే ఉంటుంది మా బామ్మ- ఎన్నిసార్లు చెప్పినా నేను పట్టించుకోననుకోండి, అయినా అది పెద్ద నస గదా, ఇంత పెద్దయ్యి కూడా ఆమాత్రం గమనించుకోలేకపోతే ఎట్లాగ, ఈ పెద్దవాళ్ళు?

ఇక మా స్నేహితులెవ్వరూ మా ఇంటికి రారు- వస్తే మా ఇంట్లోవాళ్ళు వాళ్ళని ఊరికే వదలరు- పీల్చి పిప్పి చేస్తారు. అందుకని వాళ్ళు ముందుగానే జాగ్రత్తగా తప్పించుకొని తిరుగుతారు.

అందుకే, ఇక్కడికి వస్తే "కనీసం మా స్నేహితులనన్నా కలుసుకోవచ్చు, కొంచెం ఫ్రీగా" అని ఇక్కడికొచ్చా. "ఎవరో ఇక్కడ స్కూటీ నిలబెట్టారు కదా, కనీసం నా గురించి ఆమాత్రం అన్నా ఆలోచించారు" అని ఇప్పుడే దీనిమీదికి ఎక్కి కూర్చొన్నా- ఏదో ఆలోచిస్తుండగానే కొంచెం కునుకు పట్టినట్లుంది- అంతే తప్ప నేనేమీ సొంత ఇల్లు లేని బికారిగాడిననుకోకండి..

ఏంటి, ఈ స్కూటీ మీదేనా, మీకు కావాలా? మా వాళ్ళు రాగానే ఈ స్కూటీని ఖాళీ చేస్తాను- కొంచెం ఓపిక పట్టండి, ఏంకాదు ఊరుకోండి. ఏంటి ఈ తొందర? మర్యాద..! అదే కదా, నేను చెబుతున్నది- మరీ అంత అమర్యాదగా తరుముతారేమి?!

మూడవ కథ

"ఆశకు పోతే అత్యాస మిగిలె "నట... బలే పేరు పెట్టాడేం, దినేష్ ?!

రచన: చాగంటి దినేష్ రెడ్డి, ఏడవ తరగతి, లిల్లీ, అరవింద హైస్కూల్

చాలు! చాలు! ఆపు ఇంక. అసలే సినిమాలన్నా, వాటిలో పనిచేయడం అన్నా దానికి చచ్చేటంత ఇష్టం! ఇప్పుడు నువ్వు ఫోటోలు తీస్తున్నట్లు తెలిసిందంటే చాలు- అది ఇంక లేచి ఫోజుల మీద ఫోజులు ఇస్తూనే ఉంటుంది. దాని వల్ల నీ 'మెమోరి ఫుల్' అవటమే తప్ప, ఇంకేమీ ఉండదు. నిన్ను, నీ కెమెరాని చూస్తే దాని ఊహలు

ఆకాశాన్ని అంటుతాయి. అది ఇక్కడ ఎందుకు పడుకుందో తెలుసుకోవాలనే కదా, నువ్వు ఇక్కడికి వచ్చింది?! నాకు తెలుసు! అయితే వినూ.. వినూ!



అనగనగా కుంచనపల్లి అనే ఊరు. ఆ ఊరిలో ఒక మూలగా ఉందొక చిన్న గూడెం. అందులో పుట్టింది పిల్లి. గూడెంలో ఎన్నో పిల్లులు పుట్టాయి, బ్రతుకుతున్నాయి; కానీ వేటికీ దీనికున్నన్ని తెలివితేటలు లేవు.

"ఏమా తెలివి" అంటున్నావు కదూ? ఆగు- ఓపిక ఉండాలి నీకు!

గోదావరి అని ఓ సినిమా చూసిందది. ఊళ్ళో పిల్లులన్నీ చూశాయిలే. అయితే వాటికి వేటికీ సినిమా అసలు అర్థమే కాలేదు. దీనికి మటుకు ఆ సినిమా ఎందుకు నడిచిందో బాగా అర్థమైంది. ఆ సినిమాలో కుక్క ఒకటి ఉంది. 'సినిమావాడు ఎవరిమీద ఎన్ని డబ్బులు కుమ్మరించినా, సినిమా నడిచింది మాత్రం ఆ కుక్క నటన వల్లే'- ఎవ్వరికీ అర్థం కాని ఈ రహస్యం దీనికి అర్థమైపోయింది. మరేమనుకున్నావు దీని తెలివితేటలు?!

దాంతో దీనికి ఓ కోరిక పట్టుకున్నది- కనీసం ఒక్క పిల్లి సినిమాలోనైనా తను నటించాలి. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజలూ తనను, తన నటనను ఆదరిస్తారని దాని దానికి గట్టి నమ్మకం. "నేను ఒక్క సినిమాలో నటిస్తే చాలు- నాతోబాటు ఆ సినిమా కూడా పాపులర్ అవుతుంది" అని అది ఎంతమందికో చెప్పింది.

అయినా పల్లె వాళ్లంతా మొరటోళ్ళు. దాన్ని ఎవరు పట్టించుకుంటారు చెప్పండి? దాని తెలివితేటలకు ఇక్కడ గుర్తింపు ఎందుకుంటుంది? దాని నటనను ఇక్కడెవరు ఆదరిస్తారు?

అందుకనే తన నటనతో సినిమా రంగాన్ని ఉర్రూతలూగించటం నటించడం కోసం అది పల్లె నుంచి పట్నం బయలుదేరిపోయింది.

నేనైతే దాని ఫొటోని సినిమా పత్రికల్లో చూస్తాననుకున్నాను- మరి ఇదేంటో, మీ పత్రికలో కనిపించిందది!

"ఇదేంటి?" అని అడిగితే చెప్పిందది-

మీ నగరాల కాలుష్యాన్ని, రణగొణ ధ్వనిని అది అస్సలు తట్టుకోలేకపోయిందట. మీ దగ్గర రైల్వే స్టేషన్లో ఒకచోట జనం గుంపుగా ఉండటం చూసి వెళ్లిందట. చూస్తే అక్కడో సినిమా షూటింగ్ జరుగుతూన్నదట! అక్కడ అసలు నీళ్ళే లేవు కదా, అయినా హీరో ఎవరో తెచ్చి ఇచ్చిన చేపల్ని ఒక టబ్బులోంచి పట్టి, వాటిని ఒక్కటొక్కటిగా పైకి లేపి, ఇంకో బక్కెట్లో వేస్తున్నాడట.

"ఇంకోసారి- మళ్ళీ చేపలు తేండి-" అని అరిచారట, ఎవ్వరో. చూస్తే బక్కెట్టు అంతా ఖాళీగా ఉన్నదట! ఎందుకంటే మరి, ఈ పిల్లి బక్కెట్లోకి దూకి వాటిని ఆరగిస్తూ ఉందట!

"కిలో చేపలు ఎంతనుకున్నావు? డబ్బులు ఊరికే వస్తున్నాయా?" అని దాని మీదికి దూకాడట నిర్మాతగారు. పిల్లి తిరగబడి సినిమాలోలాగా గర్జించిందట. కానీ దాని నటనను అర్థం చేసుకోలేక, ఆ సినిమాలో గూండాలంతా అప్పుడు మన పిల్లి మీదికి వచ్చారట. దానిని కొట్టి కొట్టి తరమసాగారట!

అట్లా గూండాల బారి నుండి తప్పించుకొని వచ్చి, ఇక్కడ, ఇదిగో- చక్కని పొదరిల్లులాంటి కుటీరం ముందు, పచ్చని తోటలో విశ్రాంతి తీసుకుందామని ఆగిందట. బాగా అలసిపోయి ఉన్నది కదా, అందుకని అలా ఆ స్కూటీ మీదే విశ్రాంతి తీసుకుంటూ ఒక కునుకు తీసింది. అంతలోనే మీరు వచ్చి దాన్ని కెమెరాలో బంధించారు...

ఏంటీ.. నన్ను సినిమాల్లోకి రమ్మంటున్నారా,.. దాన్ని కాదా?! నేను స్క్రీన్ప్లేలు బాగా రాస్తానా? సరేలెండి. డబ్బులు బాగానే ఇస్తారా? అయితే సరే- రాక తప్పుతుందా?! వస్తాను వస్తాను. ఎప్పుడు బయలుదేరాలంటారు?



టీచర్: ఒరేయ్! చింటూ రైలుకి, బస్సుకీ తేడా ఏంటి?

చింటూ: రైలు చెప్పి ఆలస్యంగా వస్తే, బస్సు చెప్పకుండా ఆలస్యంగా వస్తుంది టీచర్.



నాకు నచ్చే బొమ్మ

రచన: అపరాజిత, రిషివ్యాలీ స్కూల్, మదనపల్లి, చిత్తూరు జిల్లా.



మా ఇంట్లో చక్కని బొమ్మ ఒకటి ఉంది. ఆ అమ్మాయి బొమ్మ అంటే నాకు చాలా ఇష్టం. అది నాకు ఎవరిచ్చారో తెలుసా? మా అమ్మ. ఎందుకిచ్చిందో తెలుసా? నా పుట్టిన రోజు బహుమతిగా!

అది బలే బొమ్మ! దానికి ఎన్నో బట్టలు, ఎన్నో బూట్లు ఉన్నాయి. నేను దానికి రోజూ బట్టలు మారుస్తాను. అది ఉండేందుకు ఒక చిన్న ఇల్లు కూడా ఉంది మా ఇంట్లో. దాని ఇల్లు చాలా ముద్దుగా ఉంటుంది. ఆ ఇంట్లోనే

పడుకోబెడతాను దాన్ని.

దానికి నేనే పేరు పెట్టాను తెలుసా? దాని పేరు జెస్సిక. నాకు జెస్సికతో ఆడుకోవడం అంటే చాలా ఇష్టం.



నీకు తెలుసా? జెస్సిక బొమ్మ కదా, అయినా దానికి మూసి, తెరిచే కళ్లు ఉన్నాయి! పడుకోబెడితే అది కళ్ళు మూసుకొని నిద్రపోతుంది. నిలబెడితే తన నీలం రంగు కళ్ళు తెరిచి చూసి నవ్వుతుంటుంది.

జెస్సికకి మెరిసే జుట్టు కూడా ఉంది; దాని తల దువ్వేందుకు ప్రత్యేకమైన దువ్వెనలు కూడా ఉన్నాయి. నేను దానికి రోజూ తల దువ్వుతాను మరి. లేకపోతే పేన్ల సమస్య ఉంటుంది కదా, అందుకని!



నా స్నేహితులకు కూడా అందరికీ జెస్సిక అంటే చాలా ఇష్టమే. నీకు తెలుసా, జెస్సికకు ఒక చిన్న బ్యాగ్ కూడా ఉంది. మనం ఆ బ్యాగును తీసుకుంటే "నా బ్యాగు! నా బ్యాగు!" అంటుంది. దాని పొట్టను నొక్కితే కూడా అది మాట్లాడుతుంది. "నా పొట్ట! నా పొట్ట!" అంటుంది.

జెస్సికకు ఒక చిన్న డాక్టర్ సెట్ కూడా ఉంది. అందులోంచి స్పూన్ తీసి జెస్సిక నోట్లో పెడితే అది "స్పూన్! స్పూన్!" అంటుంది బలేగా. జెస్సికకి చాలా తెలివి ఉంది.

నేను జెస్సికతో రోజూ ఆడుకునేదాన్ని కదా, ఒకరోజున అది నాకు కనిపించలేదు. అప్పుడు నేను ఎంత కంగారు పడ్డానో! దాని కోసం చాలా సేపు వెతికాను. చివరికి అది ఎక్కడ దాక్కుందో తెలుసా? నా మంచం క్రింద! నన్ను ఏడిపించాలని అక్కడ దాక్కుని ఉంటుందది. భలే తెలివి దానికి. ఎట్లా ఆలోచిస్తుందో చూశావుగా? అప్పటి నుండి నేను దాన్ని ఇంకా జాగ్రత్తగా చూసుకుంటున్నాను.



ఆకుపచ్చ రంగు బట్టలలో చాలా అందంగా ఉంటుంది జెస్సిక. దాని బట్టలు అందుకనే ఎక్కువగా ఆకుపచ్చవే ఉన్నాయి. దానికేమో మరి ఎర్రరంగు బూట్లంటే చాలా ఇష్టం. అందుకని దాని బూట్లు ఎర్రగా ఉంటాయి.



జెస్సికకు ఎంత చక్కటి పిలక ఉంటుందో! దాని జుట్టు బలే ఉంటుంది మెత్త మెత్తగా, మెరుస్తూంటుంది. జుట్టు దువ్వుకునేందుకు దానికో దువ్వెన కూడా ఉంది. నేను ఒక్కోసారి దాని జుట్టు దువ్వి ఊరికే వదిలేస్తుంటాను. అప్పుడు అది నిజంగా కొత్త బొమ్మలాగా అయిపోతుంది- 'మా జెస్సికానే' అంటే ఎవరూ నమ్మరు- అంత మారిపోతుందది!

నేను పెద్దయ్యే సరికి అది నా అంత అవుతుంది కదా, అప్పుడు నేను దాన్ని ఇంకా చాలా బాగా చూసుకుంటాను!



బొమ్మకు కథ రాయండి!

"ముగ్గు బొమ్మకు కథేంటి?" అనుకుంటున్నారా ? ఎవరో ఓ పాప వేసింది ఈ ముగ్గు. "ఎవరు, వేసింది?" "ఎప్పుడు వేసింది?" "ఈ చిలకల ముగ్గునే ఎందుకు వేసింది?" అనేగా, మీరు అడిగేది? నిజంగానే అదో పెద్ద కథ. ఆ కథ ఏంటో ఊహించి మాకు రాసి పంపండి. మీ కథ ప్రచురితమైతే మరి, తాతగారిచ్చే బహుమతి మీ సొంతం ! మొదలు పెట్టండి, వెంటనే పంపండి, మరి !

ఈ బొమ్మ డా. సిరి, మిర్యాలగూడ వారి సౌజన్యం...





పండు-మామిడి చెట్టు

రచన : అడవి రాముడు, కొత్తపల్లి బృందం.

పండుకి ఆరేళ్ళు. ఈమధ్యే కొత్తగా బడికి వెళ్ళటం మొదలు పెట్టాడు. బళ్ళో టీచరుగారు చెప్పేవన్నీ శ్రద్ధగా వినటం, వాటిని అర్థం చేసుకునేందుకు ప్రయత్నించటం- ఇవన్నీ వచ్చేశాయి వాడికి.

టీచరు రాజారావు గారంటే వాడికే కాదు, పిల్లలందరికీ కూడా చాలా ఇష్టం. రాజారావు వాళ్ళకి పరిసరాల విజ్ఞానం నేర్పేవాడు. చెట్లు, మొక్కలు, పూలు, కాయలు, విత్తనాలు, జంతువులు వీటన్నిటి గురించీ ఎంత చక్కగా చెప్పేవాడంటే, పిల్లలందరికీ అవంటే పెద్ద ఇష్టం పట్టుకున్నది. రాజారావు పిల్లల సాయం తీసుకొని, బడి చుట్టుప్రక్కల అంతా శుభ్రం చేయించేవాడు, కొత్తగా చెట్లు, మొక్కలు నాటించేవాడు; వాటిని పెంచే బాధ్యతను పిల్లలకే ఇచ్చాడు- ఒక్కోరిదీ ఒక్కో చెట్టు!

పండు వంతుకు ఓ మామిడి చెట్టు

వచ్చింది. రాజారావుగారు పండుకు చెప్పారు- "చూడు పండూ! నువ్విప్పుడు ఒకటో తరగతి. ఈ బడిలో ఇంకా నువ్వు ఐదేళ్ళుంటావు. ఇక్కడినుండి వెళ్ళేలోపల నువ్వు ఈ చెట్టునుండి వచ్చిన పళ్ళు తిని, అందరికీ పంచి వెళ్తావు. సరేనా? దీన్ని జాగ్రత్తగా కాపాడుకో, మరి!" అని.

ఆ మాటలు పండు హృదయాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయి. రోజూ బడి గంట కొట్టేలోగా రావటం, మామిడి మొక్క చుట్టూ పాదు సరిగా ఉందో లేదో చూసుకోవటం, అవసరమైతే సరి చేయటం, కొంచెం ఎరువు తెచ్చి వేయటం, దాని చుట్టూ పుల్లతో గీకి, నీళ్ళు పోయటం- మళ్ళీ బడినుండి ఇంటికి పోయేటప్పుడు 'బై' చెప్పి వెళ్లటం- అట్లా ఆ తర్వాత చాలా రోజుల వరకూ వాడి మనసంతా మామిడి మొక్క పైనే.

ఒక సెలవు రోజున ఆడుకునేందుకు బడి దగ్గరికి వెళ్లాడు పండు. ఆడుతూ ఆడుతూ అనుకోకుండా తన మామిడి చెట్టు వైపుకు వెళ్ళాడు. ఆశ్చర్యం! అది ఇప్పుడు పది అడుగుల ఎత్తు ఉన్నది! దృఢంగా, నిటారుగా పెరిగింది! అదంతా తను దానికి వేసిన ఎరువు మహత్యమే! పండుకి చాలా సంతోషం వేసింది. వెళ్ళి దాన్ని ఆప్యాయంగా నిమిరాడు. దానికి తన చెక్కిళ్ళు ఆనించి మురిసిపోయాడు. అంతలో వాడికి నేలమీద ఒక పెద్ద మామిడి పండు కనిపించింది. పెద్దగా, అందంగా, ఉదయించే సూర్యునిలాగా వెలిగి పోతోందది. ఎంత తియ్యటి వాసనో! మనసును ఊరించేంత తీపి!



"నిన్నటి వరకూ ఒక్క కాయ కూడా లేదు, మరి ఒక్క రోజులోనే ఇంత మంచి పండు ఎలా తయారైందబ్బా?" అని తలెత్తి పైకి చూశాడు పండు.

చూస్తే ఆశ్చర్యం! చెట్టు నిండా కాయలే! కొన్ని కాయలు ఆకుపచ్చగా ఉన్నై; కొన్ని పసుపు రంగుకు తిరుగుతున్నై. చెట్టు మీద రామ చిలుకలు కూర్చొని ఆ పళ్ళని ముక్కుతో వాసన చూస్తున్నై.


"అరే! ఇన్ని కాయలు వచ్చినై! నేను గమనించనే లేదే?" అనుకున్నాడు పండు, మామిడి పండును చేతిలోకి తీసుకొని- "దీన్ని ఇంటికి తీసుకెళ్ళి అమ్మకు చూపిస్తాను" అని.

అయితే ఆ ఉత్సాహంలో రెండడుగులు పడ్డాయో లేదో, అక్కడున్న ఓ రాయిని తట్టుకొని బొక్క బోర్లా పడ్డాడు వాడు. చేతిలోని మామిడిపండు కాస్తా దొర్లుకుంటూ పోయింది. పండు ఆ పండు వెంట పడ్డాడు. అది పోయి అక్కడే ఉన్న ఓ మల్లెపొదలో దూరి మాయమైంది. వాడు ఆ పొదలో అంతా వెతికాడు. ఎంత వెతికినా మామిడిపండు మాత్రం కనబడదే?!

పండుకి చాలా బాధ వేసింది. "ఇంకో పండు ఎప్పటికి దొరుకుతుందో ఏమో" అని పైకి చూశాడు. చెట్టులో ఒక్క కాయ కూడా లేదు! అన్నీ మాయం!

దు:ఖం ఆపుకోలేక ఒక్కసారి గట్టిగా ఏడ్చేశాడు పండు.

వాడి ఏడుపు విని వంట పనిలో ఉన్న అమ్మ పరుగున వచ్చింది. "ఎందుకు నాన్నా, ఏడుస్తున్నావ్? అమ్మ నీ ప్రక్కనే ఉన్నదిలే, ఏడవకు. అప్పుడే తెల్లవారింది పండూ, ఇంక లే! లేచి, మొహం కడుక్కొని, స్నానం చేసి, బడికి వెళ్ళాలి కదా, నీ మామిడి మొక్కకి నీళ్ళూ పోయాలి!" అంది.



"నా మామిడి మొక్క పెద్దదైపోయింది- పెద్ద మానైందిప్పుడు!" అన్నాడు పండు.

"అవునా? అంత తొందరగానా?" అంది అమ్మ ఆశ్చర్యపోతూ.

"దానికి ఇంతలేసి కాయలు కూడా

వచ్చాయి. ఇప్పుడిప్పుడే మాగుతున్నాయి" అన్నాడు పండు.

అమ్మ నవ్వింది- "అంటే నీకో మంచి కల వచ్చిందన్నమాట!" అన్నది పండుని దగ్గరికి తీసుకుంటూ. "నీ చెట్టుకి పండ్లు వచ్చేసరికి నువ్వు నా అంత ఎత్తు అవుతావు. ఆలోగా నువ్వూ, నేనూ, అందరం వాటిని గురించి బాగా ఊహించుకోవచ్చు" అన్నది.

"ఒక మంచి మామిడి పండు దొరికిందమ్మా; కానీ అది దొర్లుకుంటూ మల్లెపొదలోకి వెళ్ళిపోయింది. ఎంత వెతికినా దొరకలేదు!" అన్నాడు పండు ఏడుపు ముఖం పెట్టి.

"నువ్వు రోజూ నీళ్ళు పోస్తుంటే, దాన్ని జాగ్రత్తగా చూసుకుంటే అది అట్లాంటి పళ్ళు నిజంగానే చాలా వస్తాయిరా, ఏమీ పర్లేదు" అంది అమ్మ వాడిని సముదాయిస్తూ.

"చెట్టుకు చాలానే పళ్ళు ఉన్నాయి. కానీ అన్నీ మాయమైపోయాయిగా?" అన్నాడు పండు నిజంగానే ఏడుస్తూ.

"లేదురా, అవన్నీ ఇంకా నీ మామిడి మొక్క లోపలే ఉన్నై. అది పెద్దయ్యాక కదా, అవన్నీ బయటికి వచ్చేది? అంత వరకూ అవి నీకు ఇట్లా కలల్లో కనిపిస్తుంటాయి. అట్లాంటి కలలు చాలా సార్లు వస్తాయిలే, అదంతా మామూలే!" వివరించింది అమ్మ.

పండుకి ఆ ఐడియా నచ్చింది. వాడి పెదాలమీద చిరునవ్వు మొలిచింది.

ఆలోగా ఒక పని చెయ్యాలి. మీ టీచరుగారిని అడిగి 'మామిడి చెట్టు ఎప్పుడు పూలు పూస్తుంది, ఎప్పుడు కాయలు కాస్తుంది, మామిడి చెట్లను ఎట్లా పెంచాలి' అన్ని వివరాలూ కనుక్కొని రావాలి. అవన్నీ తెలిస్తే మనకు గుర్తుగా ఉంటుంది కదా" పని పెట్టింది అమ్మ.

కార్యశీలి పండు గబగబా లేచాడు- ముఖం కడుక్కునేందుకు.



నిజపు సెగ!

సైన్సు టీచర్: పిల్లలూ! నాలుక తడిగానే ఎందుకుంటుంది, చెప్పండి, చూద్దాం!

విద్య : నిప్పులాంటి నిజాలు మాట్లాడినప్పుడు కాలకుండా ఉండడం కోసమేమో టీచర్!

టీచర్: వామ్మో!

సేకరణ: అలివేలమ్మ, చెన్నేకొత్తపల్లి



నిద్ర

సొంతగా కథలు రాసి చూడండి. మీరు ఎన్నడో చదివిన, మెచ్చిన కథల్లోని అంశాలే గుర్తుకొస్తాయి మొదట. తర్వాత్తర్వాత మీ జీవితానికి దగ్గరగా ఉన్న అంశాలు గుర్తుకు రావటం మొదలౌతుంది. అట్లాంటి ఓ 'మొదటి సొంత' కథ ఇది- చదివి ఎలా ఉందో చెప్పండి మల్లి అన్నకు.
రచన: కె. మల్లికార్జున, కొత్తపల్లి.

వరదాపురంలో ఉండే రాంబాబు చాలా మంచివాడు- ఏమంటే మహా భయస్తుడు. వాడికి వాళ్ల నాన్నంటే కూడా భయమే. ఏది కావాలన్నా అమ్మనే అడిగేవాడు.

వరదాపురం చాలా చిన్నది. ఊళ్లో ప్రాథమిక పాఠశాల ఉండేది; ఐదో తరగతి అవ్వగానే పై చదువుల కోసం పిల్లలందరూ దగ్గరలో ఉన్న చంద్రగిరికి వెళ్ళాల్సి వచ్చేది. ఆ ఊరికి కూడా బస్సు సదుపాయం లేదు. పిల్లలంతా ప్రతిరోజూ నడుచుకుంటూ వెళ్లాలి; నడుచుకుంటూ రావాలి! అట్లా రోజూ నడచి వచ్చి, అలసిపోయి, అన్నం కూడా

తినకుండా పడుకునేవాడు వాడు. ఇంక 'హోంవర్కు' ఎక్కడ, చదువు ఎక్కడ? రాను రాను వాడు చదువులో కూడా వెనకబడటం మొదలైంది. ప్రతిరోజూ బళ్లో టీచర్లతో తిట్లు తినసాగాడు.

అయితే నిజానికి రాంబాబు చాలా తెలివైనవాడే! "నేను ఎందుకు, మిగిలిన పిల్లల్లాగా చదవలేకపోతున్నాను?' అని ఆలోచించాడు. వాడికి అర్థం కూడా అయ్యింది: "నేను ఎక్కువ నిద్రపోతున్నాను; అందుకనే సరిగ్గా చదువుకోలేకపోతున్నాను" అని.

అయితే అట్లా ఎక్కువ నిద్రకు కారణం అలసటేనని వాడు అనుకోలేదు- అంతా తన బద్ధకం వల్లనే అనుకున్నాడు. అందుకని బద్ధకాన్ని వదిలించుకునేందుకు వాడు గట్టి సంకల్పం చేసుకున్నాడు. "రాత్రి పన్నెండు వరకూ చదువుతాను రోజూ" అనుకున్నాడు. "ఎట్లాగైనా సరే నేను నిద్రపోకుండా ఉండాలి అంతవరకూ" అనుకున్నాడు. అయితే మొదటి రోజున ఎనిమిది గంటలకల్లా అవలింతలు మొదలయ్యాయి. తొమ్మిది అయ్యాక ఇంక ఎంత ప్రయత్నించినా మేలుకొని ఉండలేకపోయాడు.

రెండవరోజునా ఇలాగే జరిగింది. వాడికి ఇంక ఏం చేయాలో తోచలేదు. వెళ్లి వాళ్ల అమ్మని అడిగాడు: "నిద్ర రాకుండా ఉండాలంటే ఏం చేయాలమ్మా" అని.

"ఏమోరా, నాకు తెలీదు. ఒకవేళ మీ నాన్నకు తెలుసేమో, అడుగు!" అన్నది అమ్మ.



రాంబాబు ధైర్యం కూడగట్టుకొని నాన్న దగ్గరికి వెళ్ళాడు: "నిద్రపోకుండా ఉండాలి అంటే ఏమి చేయాలి నాన్నా, అమ్మకు తెలీదట, నిన్ను అడగమన్నది" అనేశాడు.

వాళ్ల నాన్న కొంచెం సేపు వాడికేసే చూసి "ఇదేం ప్రశ్నరా? ఎవరైనా నిద్రపోకుండా ఉంటారా?" అన్నాడు.

ఊళ్ళో కనబడిన వాళ్ళనల్లా ఇదే అడుగుతూ పోయాడు రాంబాబు. నిద్ర రాకుండా ఉండే మార్గం మటుకు ఎవ్వరూ చెప్పలేక పోయారు. చివరికి వాళ్ళ టీచరుగారు కూడా "నీ ప్రశ్నకు సమాధానం ఇంక ఆ దేవుడే చెప్పాలిరా" అనేశాడు.

ఆ రోజు సాయంత్రం ఇంటికి వచ్చేసరికి రాంబాబుకు ఒకవైపున నిద్ర వస్తూండింది; మరోవైపున మెలకువ ఉండింది. కుర్చీలో కూర్చున్నవాడు కూర్చున్నట్లే ఉన్నాడు; పడుకున్నవాడు పడుకున్నట్లే ఉన్నాడు. వాళ్ల అమ్మ,నాన్న ఏం చెప్పినా వాడికి అసలు వినబడనే లేదు. మనసులో అంతా అదే ఆరాటం: "దేవుడిని అడగాలి; నిద్ర లేకుండా వరం సంపాదించుకోవాలి" అని.

రోజులు గడిచే కొద్దీ రాంబాబు ఓ ఋషిలా మారిపోయాడు. ఇప్పుడు వాడి ధ్యాస అంతా దేవుడే. అనుక్షణం అతను దేవుడిని తలచుకుంటూనే ఉన్నాడు. "దేవుడా, రా! నా నిద్రను పోగొట్టు" అని. చివరికి ఇంక దేవుడు ఆగలేక పోయాడు. రాంబాబుకు ప్రత్యక్షమయ్యాడు. "నాయనా, రాంబాబూ! ఎందుకు బాబూ, నీకింత పట్టుదల?" అన్నాడు.

"స్వామీ! నేను నిద్ర పోవటం వల్ల చదవలేక పోతున్నాను. అలా చదువులో వెనకబడిపోతున్నాను. అందరిలోనూ నవ్వుల పాలౌతున్నాను. నాకు ఈ నిద్ర వద్దు. నాకు అసలు నిద్రే లేకుండా వరమివ్వు స్వామీ. ఇంకేమీ వద్దు" అనేశాడు రాంబాబు.

దేవుడు నవ్వాడు-"రాంబాబూ! నువ్వు ఏం కోరుతున్నావో నీకు అర్థమౌతున్నదా?" అన్నాడు.

"లేదు స్వామీ! నేను బాగా ఆలోచించాకే ఈ నిర్ణయానికి వచ్చాను" అన్నాడు రాంబాబు.

దేవుడు నిట్టూర్చాడు. "సరే నాయనా! ఇక పైన నీకు నిద్ర ఉండదు గాక ఉండదు" వరం ఇచ్చేసి మాయమైపోయాడు దేవుడు.

రాంబాబుకు బలే సంతోషం వేసింది. ఆరోజంతా బలే చదివాడు. రెండవరోజు కల్లా తన నోట్సులన్నీ పూర్తయినాయి.

మూడో రోజున వాడికి కొద్ది కొద్దిగా తలనొప్పి మొదలయింది. ఆరోజు సాయంత్రం కల్లా వాడికి కడుపునొప్పి వచ్చింది. తల తిరిగినట్లు అయ్యింది. వాంతులు అవ్వసాగాయి. నీరసం అనిపించసాగింది. మనసు దేనిమీదా లగ్నం కాలేదు. పడుకుంటే, నిద్ర రాదు!



అటుపైన వాడు ఏం చేసినా, ఎన్ని ఆసుపత్రులకు తిరిగినా ఏమాత్రం లాభం లేకపోయింది. బరువు తగ్గుతూ పోయాడు. రోజు రోజుకూ వాడి ఎముకలు బయట పడ్డాయి. ఎంత నీరసించి పోయాడంటే, అడుగు తీసి అడుగు పెట్టటం గగనం అయిపోయింది. అట్లా ప్రాణం మీదికి వచ్చాక, వాడి గట్టితనం అంతా కరిగిపోయి, కళ్లలో నీళ్ళు వచ్చాయి.

ఆ సమయంలో మళ్ళీ కనిపించాడు దేవుడు- "ఏం రాంబాబూ? అర్థమైందా? అన్నీ ఆలోచించాకే నిర్ణయానికి వచ్చానన్నావే?" నవ్వుతూ అన్నాడు.

"స్వామీ! నిద్ర లేకపోతే బాగా చదవచ్చు కదా- అనుకున్నాను. కానీ ఇదేంటో స్వామీ ఇట్లా జరిగింది?!" అన్నాడు రాంబాబు.

దేవుడు మళ్ళీ ఓసారి నవ్వి "రాంబాబూ! ఈ లోకంలో నిద్ర అనేది లేకపోతే ఎవ్వరూ బ్రతకలేరు. పని చేసి అలసిపోయిన మెదడుకు, ఇతర శరీర భాగాలకు కొంత విశ్రాంతి లభించేది నిద్రలోనే. నిద్ర మనిషికి బరువు కాదు; అది మనిషికి చాలా అవసరం! ఆహారం ఎంత అవసరమో, నిద్రకూడా అంతే అవసరం! గొప్ప గొప్ప శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, రచయితలు అంతా నిద్రలేకపోవడం వల్ల గొప్పవాళ్లయ్యారు అనుకుంటున్నావా, కాదు! అంతా కష్టపడి గొప్పవాళ్లయ్యారు. వాళ్ళు చేసే పనిని ఇష్టంగా, మనసు పెట్టి చేయటం వల్ల

గొప్పవాళ్ళు అయ్యారు. నువ్వు బాగా చదవకపోవడానికి కారణం నిద్ర కాదు నాయనా, నువ్వు శ్రమించకపోవడం. నీ చదువుని నువ్వు ప్రేమించకపోవటం. దాని మీద శ్రద్ధ పెట్టకపోవటం. అర్థమయ్యిందా, ఇప్పట్నుంచి అయినా కష్టపడి చదువు. ఈ తపస్సులు, నన్ను పిలవటాలూ పెట్టుకోకు!" మందలించి, మాయమైపోయాడు.

సరిగ్గా అదే సమయానికి రాంబాబు వాళ్ళమ్మ "ఒరే!రాంబాబూ! ఇంత మొద్దు నిద్ర పోతే ఎలారా? అసలే మార్కులు బాగా రాలేదన్నావు?!" అని వాడిని నిద్రలేపింది.

చూసుకుంటే వాడు బలంగానే ఉన్నాడు- ఏమీ చిక్కిపోలేదు! 'ఓహో ఇదంతా కలేనా, దేవుడేమీ రాలేదా?'అని రాంబాబు నవ్వితే వాళ్లమ్మ వాడికేసి వింతగా చూసింది.



స్వాగతం!

భారత ప్రభుత్వపు పత్రికా విభాగం వారి గుర్తింపు లభించాక వెలువడుతున్న మొదటి కొత్తపల్లి ఇది- దీనిపై మీ అభిప్రాయాలను, సలహాలు-సూచనలను మాకు రాసి పంపండి. అట్లా కొత్తపల్లిని మరింత అందంగా తీర్చిదిద్దేందుకు వీలవుతుంది. మరింతమంది పిల్లలకు తెలుగంటే మక్కువ ఎక్కువౌతుంది!

చూశారుగా, కొత్తపల్లిలో పిల్లల రచనలకు ప్రాధాన్యత ఉంటుంది. ఈ పుస్తకంలో దాదాపు సగం కథలు పిల్లలు రాసినవి; మిగిలినవి పిల్లలకోసం పెద్దలు రాసినవి. బొమ్మలు వేసినవాళ్ళు మటుకు యువకులు.

పిల్లలను కలవటం, వాళ్లతో తెలుగులో కథలు రాయించటం, బొమ్మలు వేయించటం, వాళ్ళు పంపిన కథల్ని, బొమ్మల్ని సరిదిద్ది మిగతా పిల్లలందరికీ నచ్చేట్లు పుస్తకాలుగా తయారు చేయటం, దానికోసం ఓపెన్ సోర్సు ఉపకరణాలను వాడటం, కథల్ని అందరూ ఉచితంగా చదువుకునేట్లు ఇంటర్నెట్‌లో పెట్టటంతోపాటు, కొన్ని ప్రతులు అచ్చు వేయటం మాకు ఇష్టం. అందరి మేలూ కోరి చేసే ఈ పనిలో మీరూ పాలుపంచుకోండి. సాయం చేయండి. పిల్లల కథల ప్రపంచానికి స్వాగతం !

కొత్తపల్లి బృందం



మూడు పంది పిల్లల కథ

ఆంగ్ల జానపద కథలు బానే ఉంటాయి; కానీ ఎందుకనో "అవి మనకు దగ్గరగా లేవు; మన పిల్లలకు పూర్తిగా సరిపోవు" అనిపిస్తుంది. మూడు పంది పిల్లల కథ మీకు తెలుసుగా- మనం చెప్పుకుంటే ఆ కథ ఎలా ఉండాలి? ...ఇదిగో ఇలా ఉండాలి!

ఆధారం: ఆంగ్ల జానపద కథ "త్రీ లిటిల్ పిగ్స్" నవీనీకరణ: రాధ మండువ, రిషివ్యాలీ స్కూలు.


అనగనగా ఒక అడవి. ఆ అడవి ప్రక్కన ఒక ఊరు. ఆ ఊళ్లో మూడు పంది పిల్లలు, వాళ్ళ అమ్మనాన్నలతో కలిసి హాయిగా బతుక్కుంటూ ఉండేవి.

కొన్నాళ్లకు అవి కాస్త పెద్దవైనై. అప్పుడు ఇంక వాళ్ళ ఇల్లు ఐదుగురికీ సరిపోలేదు. దాంతో వాళ్ళ అమ్మానాన్నలు అన్నాయి, "ఇదిగో పిల్లలూ, మనకు ఐదుగురికీ ఇంత చిన్న ఇల్లు చాలట్లేదు; అందుకని మీకు మీకు నచ్చినట్లు వేరేగా మంచి ఇల్లు కట్టుకొని బతుక్కోండి" అన్నాయి.

అప్పుడు ఆ మూడు పంది పిల్లలూ మంచి ప్రదేశం కోసం వెతుక్కుంటూ వెతుక్కుంటూ అడవిలో లోపల్లోపలికి వెళ్ళాయి. అక్కడ, ఓ

రావిచెట్టుకి దగ్గర, మంచి చోటు ఒకటి కనిపించింది వాటికి.

"చోటు అయితే దొరికింది, కానీ ఇల్లు ఎలా కట్టుకోవాలిరా" అనుకున్నై అవి. అట్లా అనుకుంటుంటే, ఆ దారినే పోతున్న ఒంటె ఒకటి ఈ పందిపిల్లల్ని చూసి ఆగింది: "ఏంటమ్మా, సంగతి? ఏంటి ఆలోచిస్తున్నారు?" అని అడిగింది.



"మేం ఇక్కడ ఓ మంచి ఇల్లు కట్టుకోవాలనుకుంటున్నాం. అయితే ఇల్లు దేనితో కట్టుకోవాలో తెలియట్లేదే!" అన్నాయి పందులు మూడూ.

"ఏమీ దిగులు పడకండి పిల్లలూ! నాకు ఓ ఇటుకల బట్టీ ఉంది. బాగా కాల్చిన ఇటుకలు ఇస్తాను. వాటితో చక్కటి ఇల్లు కట్టుకోండి!" అంది ఒంటె.

పందిపిల్లలు చాలా సంతోష పడినై. "మాకు దారి చూపించావు ఒంటే! నీకు ధన్యవాదాలు!" అని, బట్టీ దగ్గరికి వెళ్ళి ఇంటికి కావలసినన్ని ఇటుకలు తెచ్చుకున్నాయి. అటుపైన మూడూ కలిసి బాగా శ్రమపడి, వాటితో మంచి ఇల్లు కట్టుకున్నాయి. చక్కటి ఇల్లు తయారైంది.

ఆ రోజు నుండీ మూడు పంది పిల్లలూ ఆ ఇంట్లో ఉండటం మొదలు పెట్టాయి. ఆ చుట్టుప్రక్కల అంతా శుభ్రం చేసుకున్నాయి; నీళ్ళు చల్లాయి; ఇంటి ముందు అంతా అలికాయి; ముగ్గులు పెట్టుకున్నాయి; ఎంత శుభ్రంగా ఉంచుకున్నాయంటే, భలే ఉంచుకున్నాయి.

వాళ్ళ ఈ కొత్త ఇంటిని చూసింది- ఒక తోడేలు. "ఎవరు, ఇక్కడ అడవిలో ఏదో ఇల్లు కట్టుకున్నట్లున్నారే?! ఎవరిది?" అనుకున్నది.



అనుకొని, మెల్లగా-జాగ్రత్తగా చెట్టు చాటున నిలబడి చూసింది. "ఓహో! చిట్టి చిట్టి పంది పిల్లలు! బలే ఉన్నాయి! తింటే బలే ఉంటుంది!" అనుకున్నది. ఆ ఆలోచన వచ్చేసరికి దానికి బలే నోరు ఊరింది.

ఒకరోజు ఉదయాన్నే అది పందులున్న ఇంటి దగ్గరకొచ్చి "ఏయ్, మురికి పందులూ, నన్ను లోపలకి రానివ్వండి!" అన్నది.

"నిన్ను మేము రానివ్వం! ఎట్టి పరిస్థితుల్లోనూ రానివ్వం తల్లీ! రానిస్తే నువ్వు మమ్మల్ని తినేస్తావు- మాకు తెలుసు!" అన్నాయి పందులు.

"మీరు రానివ్వకపోతే మీ ఇంటిని ఊదేస్తాను, మీ ఇంటిని పగలగొట్టేస్తాను, మీ ఇంటిని పీకేస్తాను, మిమ్మల్ని పట్టి కడుక్కోని తినేస్తాను!" అంది తోడేలు పళ్ళు బయట పెట్టి.

"వద్దు! వద్దు! మా ఇంటిని ఏమీ చెయ్యకు!" అని అరిచాయి పందులు, లోపలనుండి.

తోడేలు "హఫ్, హుఫ్, హఫ్, హుఫ్.." మని ఊదింది. ఇంటిని బాగా గీకింది. ఇటుకల్ని పట్టుకొని పీకేందుకు ప్రయత్నించింది.

ఏం చేసినా ఇల్లు మాత్రం కదల్లేదు.

"అబ్బ! ఈ ఇల్లు గట్టిగా ఉందే!" అనుకున్నది తోడేలు. బయటికి ఏమన్నది? "సరేలెండి పిల్లలూ! ఇప్పుడు చీకటి పడింది; కాబట్టి వెళ్ళిపోతున్నాను. రేపు సాయంత్రం సుత్తితో వస్తాను. మీ తలుపుని పగలగొట్టుకొని లోపలకి వస్తాను! చూస్తూండండి" అంటూ వెళ్ళిపోయింది.

"వద్దు! వద్దు! మా తలుపునేమీ చేయొద్దు!" అరిచాయి పందులు.

తెల్లవారింది. కానీ అసలు పంది పిల్లలకి ఆ రాత్రి నిద్ర పట్టనే లేదు! పొయ్యి రాళ్ళలాగా మూడూ మూడు మూలల్లో ఏడుస్తూ కూర్చున్నాయి. ఎంత ఏడ్చినా ఏం చెయ్యాలో మటుకు తెలీలేదు వాటికి.

తెల్లవారాక, మూడూ కలిసి ఇంటి ముందు పేడ అలుకుతుంటే, అటుగా పోతున్న నిప్పుకోడి ఒకటి అక్కడ ఆగింది. "ఏంటి, మీ ముఖాలు అలా ఉన్నాయి? రోజూ సంతోషంతో వెలిగిపోయేవి కదా! అట్లా వెలిగితేనే బాగుంటారు మీరు!" అన్నది.

"తోడేలు మా తలుపులు పగలగొట్టేస్తుందట ఇవాళ్ల!" అన్నాయి పంది పిల్లలు.

"అయ్యో!ఏడవకండి. ఈమాత్రం దానికి ఏడుస్తారా, ఎవరైనా? నా దగ్గర పట్టుకుంటే షాక్ కొట్టే తాళాలు ఉన్నాయి. వాటిని తెచ్చి మీ ఇంటి చుట్టూ బిగించండి. ఆ తోడేలు కనబడగానే స్విచ్ వేసి పెట్టండి- అది ఒక్కసారి గొళ్ళాన్ని పట్టుకున్నదంటే చాలు- షాక్ కొట్టి అల్లంత దూరాన పడుతుంది. ఇంక జన్మలో మీ జోలికి రాదు!" అంది నిప్పుకోడి.

మూడు పందులూ నిప్పుకోడికి "థాంక్స్" చెప్పాయి. వాళ్ళు ఫ్యాక్టరీకి వెళ్ళి కరెంట్ తాళాలు తెచ్చాయి. ఇంటి చుట్టూ బిగించాయి.

సాయంత్రం అయ్యింది. తోడేలు వచ్చింది- పెద్ద సుత్తి ఒకటి పట్టుకొని వచ్చింది అది- "ఏయ్, మురికి పందులూ! కంపు కొట్టే పందులూ! నన్ను లోపలకి రానిస్తారా, లేదా?!" అంది.

"రానివ్వం! రానివ్వం! మేం నిన్ను రానివ్వం తల్లీ! ఎట్టి పరిస్థితుల్లోనూ రానివ్వం! లోపలికి రానిస్తే మమ్మల్ని తినేస్తావని మాకు తెలుసు!" అన్నాయి పందులు.



"మీరు రానివ్వకపోతే మీ తాళాన్ని పీకేస్తాను; మీ తలుపులని పగలగొడతాను, లోపలికి వచ్చి మిమ్మల్ని పట్టి కడుక్కోని తినేస్తాను!" అంది తోడేలు పళ్ళు బయట పెట్టి.

"వద్దు! వద్దు! మా తలుపుల్ని ఏమీ చెయ్యకు!" అని అరిచి గబగబా స్విచ్ వేశాయి పందులు. స్విచ్ వేయగానే

తాళాలన్నీ ఎర్రగా మండటం మొదలు పెట్టాయి.

అయినా తోడేలు ఆగలేదు. సుత్తి తీసుకుని తాళం మీద గట్టిగా ఒక్క దెబ్బ వేసింది. అంతే- ఒక్కసారిగా షాక్ కొట్టి ఎగ్గిరి అవతల పడింది.

“ఓహో! కరెంట్ తాళాలు వేశారా? సరేలే! రేపు వస్తాను! ఈసారి డ్రిల్లింగ్ మిషన్ తెస్తానులే, చూస్తూండండి- ఎట్లా తాళాలు పగలగొట్టి లోపలకి వస్తానో!" అంది కోపంగా, కోరలు బయటికి పెట్టి.

“వద్దు! వద్దు! మా తాళాల్ని ఏమీ చేయొద్దు!" అని అరిచాయి పందులు.

ఆరోజు రాత్రంతా ఆలోచించాయి పందులు. ఏం చెయ్యాలో తెలీనే లేదు.

చూస్తూండగానే తెల్లవారింది. వాటికి మళ్ళీ ఏడుపు వచ్చేసింది. ఇంటి వాకిట్లో కూర్చుని మూడుకు మూడూ గట్టిగా ఏడవటం మొదలు పెట్టాయి.

అప్పుడు ఆ దారిలో పోతున్న సీతాకోక చిలుకల గుంపు ఒకటి ఈ పందుల దగ్గర వాలింది. అవన్నీ ముక్కు మూసుకుని- "ఎందుకేడుస్తున్నారు?" అని అడిగాయి.

విషయం చెప్పగానే అవన్నీ నవ్వాయి. ముఖాలు ముఖాలు చూసుకున్నాయి.

"మేం చెప్పినట్లు చేయండి. ముందుగా అదిగో- ఆ ప్రక్కనున్న చెరువులో స్నానం చేసి రండి" అంది ఒక తెల్లని సీతాకోకచిలుక.

మూడు పందులూ పోయి బాగా తోముకుని స్నానం చేసి వచ్చాయి.

"ఈ ఇంటిని ముందు రకరకాల పూల చెట్లతో అలంకరించండి!" అన్నాయి ఎరుపు, నలుపు, నీలం రంగు సీతాకోక చిలుకలు.

మూడు పందులూ గబగబా వెళ్ళి, రకరకాల రంగుల పూలచెట్లని తీసుకొచ్చి నాటాయి. అన్నిటికీ అప్పటికే పూలు పూసి ఉన్నాయి!

“మరి, ఇప్పుడు మీ ఇంటి పైకి ప్రాకేట్లుగా పూల తీగలని నాటండి" అన్నాయి పసుపురంగు సీతాకోకచిలుకలు.

పందులు పూలతీగలను తెచ్చి ఇంటి పైకి ప్రాకించాయి.

చూస్తే ఇల్లు చా..లా అందంగా తయారయింది.



"అబ్బ! మీ ఇల్లు ఇప్పుడు ఎంత బాగుంది?!" అంటూ సీతాకోకచిలుకలన్నీ ఇంటి ముందు పుప్పొడితో రంగవల్లులు వేసినై. "తోడేలు వచ్చినప్పుడు ఇట్లా చెయ్యండి- అని ఏవేవో చెప్పి, చక్కగా ఎగురుకుంటూ వెళ్ళిపోయాయి.

పందులకి చాలా సంతోషం వేసింది. "మీరు బలే సలహాలు ఇచ్చారు! వామ్మో, మీ సలహాలు చాలా బాగున్నై!" అని సీతాకోకచిలుకలకి వీడ్కోలు చెప్పాయి.

"ఆహా! ఇవాళ్ల మన ఇల్లు ఎంత బాగుంది?!" అనుకున్నాయి మళ్ళీ. ఆ రోజు మధ్యాహ్నానికే అవి మూడూ బాగా అలిసిపోయి, హాయిగా పడుకుని నిద్రపోయాయి.

సాయంత్రమైంది. డ్రిల్లింగ్ మిషన్ పట్టుకొని వచ్చింది తోడేలు.

రాగానే- "పందులుండే ఇల్లు ఇది కాదే, దారి తప్పానా, ఏంటి?" అనుకుందది. కళ్ళు నులుముకొని సరిగా చూసింది. "ఆహా, ఇదే! కానీ ఈ ఇల్లు ఎంత బాగుంది?!" అని దగ్గరికి వచ్చింది. "ఓ పందులూ, శుభ్రంగా ఉన్న పందులూ! మీ ఇల్లు ఎంత బాగుంది! ఎంత సువాసనగా ఉంది! నన్ను లోపలకి రానివ్వండి!" అని అడిగింది గౌరవంగా.

"రానిస్తాం, కానీ నువ్వు మమ్మల్ని ఎందుకు తినాలనుకుంటున్నావ్, అసలు? మా దగ్గర బోలెడన్ని దుంపలున్నాయి; కుండల కుండల తేనె ఉంది. నీకు అవన్నీ ఇస్తాం. నువ్వు మాతో స్నేహం చేస్తే చాలా ఆటలు కూడా నేర్పుతాం కదా?!" అన్నాయవి.

తోడేలు కొంచెం ఆలోచించింది. "ఓ! అలాగే, నేను మీతో స్నేహం చేస్తాను. మీరు పెట్టినవే తింటాను; మీరు నేర్పే ఆటలు నేర్చుకుంటాను. లోపలకి రానివ్వండి. మీ ఇంటిని చూస్తుంటే నాకు హాయిగా ఉంది. ఇంతకు ముందు మిమ్మల్ని తింటానని

బెదిరించినందుకు క్షమించండి" అన్నది.

"ఇప్పుడు మేం కూడా చాలా సంతోషంగా ఉన్నాం!" అంటూ పందులు తలుపు తీశాయి.

తోడేలు లోపలకి వెళ్ళింది. శుభ్రంగా ఉన్న పందుల్నీ, వాటి ఇంటినీ చూసి చాలా ఆనందపడింది. అన్నీ చక్కగా చేతులు కడుక్కుని, దుంపలు తిన్నాయి; తేనెని తాగాయి; ఇంటి వెనక ఉన్న తోటలో అన్నీ కలసి సంతోషంగా ఆటలాడుకున్నాయి.

రావి చెట్టు మీద వాలి ఇదంతా చూస్తున్న సీతాకోకచిలుకలు కిలకిలా నవ్వాయి.



మంచి పద్యం!

ఎవ్వనిచే జనించు జగమెవ్వనిలోపలనుండు లీనమై,
ఎవ్వని యందు డిందు పరమేశ్వరుడెవ్వడు మూలకారణం
బెవ్వడనాది మధ్య లయుడెవ్వడు సర్వము తానెయైన వా
డెవ్వడు వాని నాత్మభవునీశ్వరునే శరణంబు వేడెదన్!

"ఈ జగత్తు అంతా ఎవ్వనిలో పుడుతుంది, ఎవ్వనిలో లీనం అయి ఉంటుంది, ఎవ్వనిలో చేరి నశిస్తుంది? దీనికి మూలకారణం ఎవరు? తుది, మధ్య, మొదలు అంటూ లేకుండా అంతా తానే ఐనవాడు ఎవ్వడు? తనంతట తానే పుట్టిన ఆ గొప్ప భగవత్తత్వాన్ని నేను శరణు వేడుతాను"

అద్భుతమైన ఈ పద్యం బమ్మెర పోతన రచించిన భాగవతంలోనిది. మొసలి నోట చిక్కిన ఏనుగు ఒకటి అన్నిటికీ అతీతుడైన భగవంతుడిని ఆర్తిగా ఇలా ప్రార్థిస్తుంది. తరతరాలుగా అనేకమంది తెలుగువారికి భగవంతుడిని దగ్గరగా తెచ్చిన పద్యం ఇది! మీరూ నేర్చుకోండి మరి, ఆలస్యమెందుకు?

'క్రీడలకు సమయం ఇవ్వలేని వారు రోగాలకు సమయం ఇవ్వాల్సి వస్తుంది' -జన్‌వనమకర్



మూడు చెట్ల కథ

రచన: ఉజ్వల్, హైదరాబాదు.

శేషాచలం అడవిలో మూడు చెట్లు ఉండేవి.

ఒకరోజున మొదటి చెట్టు అన్నది- "నన్ను కొట్టేశాక నాలో రాజు కూర్చోవాలని నా కోరిక" అని.

అప్పుడు రెండో చెట్టు అంది-"బంగారం, వెండి, మణి మాణిక్యాలు దాచుకోవడానికి నేను ఉపయోగపడాలని నా కోరిక" అని.

అది విని మూడవ చెట్టు అన్నది-"నేను అన్ని చెట్లకన్నా ఎత్తుగా పెరగాలి; అందరూ నన్ను తలెత్తి చూడాలి; నాకో గుర్తింపు ఉండాలి" అని.

కొన్నాళ్లు అయ్యాక ఒక వడ్రంగి అటుగా వచ్చి చూసాడు. మూడు చెట్లనూ చాలా ఇష్టపడ్డాడు. పనివాళ్ళను పిల్చుకొచ్చాడు; మొదటి రెండు చెట్లనూ కొట్టించుకెళ్ళాడు. మూడవ చెట్టును ఏమీ చెయ్యలేదు.

వడ్రంగి తను తీసుకెళ్ళిన మొదటి చెట్టును ఉయ్యాల తొట్టిగా మలచాడు. "అయ్యో! నాలో రాజు కూర్చోవాలంటే ఇతను ఇలా చేశాడే" అని బాధపడింది చెట్టు. అయితే

అతను ఆ ఉయ్యాల తొట్టి చేశాడో లేదో, దంపతులు ఒకరు వచ్చి దాన్ని ఇష్టంగా కొనుక్కెళ్ళారు. వాళ్లకు లేక లేక ఒక కొడుకు పుట్టాడు. వాడిని వాళ్ళు చాలా మురిపెంగా పెంచుతున్నారు.

తల్లి వాడిని ఉయ్యాలలో వేసి ముచ్చటగా "ఉయ్యాల-జంపాల ఊగరావయ్య! ఎనలేని భోగాల తూగి మా ఇంట వెలసిన రాజు నీవయ్యా!" అని జోలపాటలు పాడింది.

అటుపైన ఆ చుట్టు ప్రక్కల ఎవరింట్లో పిల్లలు పుట్టినా 'ఈ ఉయ్యాల డిజైన్ బలే ఉంటుందమ్మా!" "ఇది బలే అచ్చొచ్చిన ఊయలమ్మా" అని దాన్ని ఇష్టంగా తీసుకెళ్ళేవాళ్లు. వాళ్ల పిల్లల్ని బారసాల రోజున ఆ ఉయ్యాల్లో పడుకోబెట్టేవాళ్లు. "రాజువయ్యా, రాణివమ్మా" అని పాటలు పాడేవాళ్ళు.

అదంతా చూసి మొదటి చెట్టు తన కల నిజమైందని చాలా సంతోషించింది: "ప్రతి తల్లికీ తమ పిల్లలు రాజులే, మహారాణులే, చక్రవర్తులే. ఇట్లా ఎంతో మంది రాజుల్ని, రాణుల్ని, రారాజుల్నీ, చక్రవర్తుల్నీ ఊపిన ఘనత నాదే!" అనుకున్నది మొదటి చెట్టు.

ఇక రెండవ చెట్టును కొట్టిన వడ్రంగి పుస్తకాలు పెట్టుకునే అలమారను ఒకదాన్ని తయారు చేశాడు దానితో. దానిమీద అద్భుతమైన దృశ్యాలు, డిజైన్లు చెక్కాడు.

దాన్ని ఎంత అందంగా మలచాడంటే, అతను దాన్ని పూర్తి చేశాడో-లేదో నగరంలోని ఒక లైబ్రరీ వాళ్ళొచ్చి దాన్ని ఎక్కువ ధరకు కొనేశారు.

ఆ లైబ్రరీ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రిగారు విచ్చేశారు. ఆయన తన ఉపన్యాసంలో విద్య గురించి చెబుతూ

"న చోర హార్యం

దొంగలెత్తుకుపోనిది,

న చ భారకారి

బరువు లేనిది,

వ్యయే కృత వర్ధత ఏవ నిత్యం

ప్రతి రోజూ ఖర్చు పెట్టినా వృద్ధి చెందేది,

విద్యా ధనం సర్వ ధన ప్రధానం"

అన్ని సంపదల కన్నా గొప్ప సంపద- విద్య !

"అట్లాంటి విద్యను మనకు అందించేవి

పుస్తకాలు. ఆ గ్రంథాలకు ఆధారం ఇదిగో, ఈ అలమార! విజ్ఞానం అనే నిధికి నెలవు ఇదిగో, ఈ గ్రంథాలయం" అని వివరించారు.

అది విని రెండవ చెట్టు సంతోషపడింది- ఇంత విలువైన ధనాన్ని సంరక్షించేందుకు ఉపయోగపడ్డానే, నా జన్మ ధన్యం!" అనుకున్నది.

ఇట్లా కొన్ని యేళ్లు గడిచాయి. మూడవ చెట్టు ఎత్తుగా పెరిగింది. దానిని వడ్రంగి కొట్టనే లేదు.

"ఆ రెండు చెట్ల కోరికలూ తీరాయేమో! నా కోరికే, ఇంకా నెరవేరనిది!" అనుకునేదది. "నా గతి ఏమౌతుందో ఏమో! నా కోరిక నెరవేరుతుందో లేదో?" అని అనుమాన పడేది.

కొన్నాళ్లకు చాలామంది పనివాళ్ళు వచ్చారు. పెద్ద లారీని తీసుకొచ్చారు. దానికి అనేక చక్రాలున్న పొడవాటి ట్రాలీ.

అందరూ కలిసి ఆ చెట్టును కొట్టి ట్రాలీలోకి ఎక్కించి జాగ్రత్తగా తీసుకెళ్లారు. "ఏం చేస్తారో, ఏమో" అని కంగారు పడింది మూడో చెట్టు.

వాళ్ళంతా కలిసి ఆ చెట్టును తిరుమలకు తీసుకెళ్ళారు. దానికి అభిషేకాలు జరిపి, చందనం రాసి, బంగారు తొడుగు తొడిగి, దేవుడి ముందు నిలబెట్టారు.



రోజూ లక్షలాదిమంది భక్తులు తలెత్తి చూసి ఆ ధ్వజ స్థంభానికి నమస్కరించసాగారు. ఆనందంతో పులకలెత్తింది మూడో చెట్టు.

ఆలస్యమైతేనేమి, ఆ విధంగా ప్రతి చెట్టు కోరికా నెరవేరింది!



"మొక్కలకూ భావాలుంటాయి. అవి వాటిని ప్రకటిస్తుంటాయి" అని కనుక్కున్న శాస్త్రవేత్త- 'జగదీశ్ చంద్ర బోస్'



మేలుకు కీడు-కీడుకు మేలు

మన సాహిత్యంలో ఇట్లాంటి కథలు అనేక సంవత్సరాలుగా చాలానే వచ్చాయి. మీరూ చదివారా, మరి?
రచన: సి. ప్రణయజ, వెంకటేశ్వర బాలకుటీర్, గుంటూరు.

పొరుగూరిలో పని. అడవిగుండా వెళ్ళాలి. సాయంత్రం పూట అటుగా ఎవ్వరూ వెళ్ళరు. అయినా తప్పదు. బయలుదేరి పోయాడు ఆశారాం. చీకటిలో దారి సరిగా కనిపించలేదు. దారి తప్పాడు. చివరికి జంతువుల్ని వేటాడేందుకు ఎవరో వేటగాళ్ళు తవ్విన గుంటలో పడిపోయాడు.

మొదట్లో బాగా గట్టిగా అరిచాడు. ఏడ్చాడు. తన్నుకులాడాడు. 'పైకి ఎలా ఎక్కి రావచ్చు?' అని ఆలోచించాడు. ఏమీ లాభం లేకపోయింది. రాను రాను ఆకలైంది. చివరికి ఆకలి చచ్చిపోయింది. భయం వేసింది. తర్వాత ఆ భయమూ పోయింది. 'తనను ఎవ్వరూ కాపాడరు' అని నిరాశ కూడా వచ్చింది ఆశారాంకు. నీరసంతో అరుపులు కాస్తా మూలుగులైనాయి.

రెండు రోజులు గడిచాయి. అటుగా ఎవ్వరూ రాలేదు. లేని శక్తిని కూడగట్టుకొని

గట్టిగా మూలిగాడు ఆశారాం. అతని అదృష్టం బాగున్నట్లుంది. సరిగ్గా ఆ సమయానికి అటుగా వెళ్తున్న విష్ణువర్మకు ఆ మూలుగు వినబడింది!

విష్ణువర్మ మంచివాడు. జమీందారు గారి దగ్గర పాలేరు. 'ఇక్కడ ఎవరో ఉన్నట్లున్నారు' అని అంతటా వెతికాడు. చివరికి ఆ గుంటలో కనిపించాడు ఆశారాం. దెబ్బలతో, భయంతో, నీరసించిపోయి ఉన్నాడు పాపం.

విష్ణువర్మ వెంటనే అతన్ని బయటకు లాగాడు. తను తెచ్చుకున్న రొట్టెలను పెట్టి తినమన్నాడు. వెతికి దగ్గర్లో ఉన్న సరస్సునుండి నీళ్ళు తెచ్చి ఇచ్చాడు. అతను తేరుకున్నాక, అతన్ని తన గుర్రం మీద ఎక్కించుకొని వేగంగా ప్రయాణించాడు.

ఇంకో గంటకే బాగా అలసిపోయాడు విష్ణువర్మ కూడా. "మిత్రమా! బాగా అలసటగా ఉంది. ఇక్కడెక్కడైనా ఆగి కొంతసేపు విశ్రాంతి తీసుకుందాం. నా చేతిలో జమీందారు గారి డబ్బుంది. అందుకని కొంత జాగ్రత్త అయితే అవసరం. ముందు నేను పడుకొని కొంచెం సేపు కునుకు తీస్తాను. ఆ సమయంలో నువ్వు కాపలాగా ఉన్నావంటే, ఆ తర్వాత నువ్వు పడుకున్నప్పుడు నేను కాపలా ఉండచ్చు. అట్లాగైతే జంతుభయం కూడా ఉండదు!" అన్నాడు విష్ణువర్మ.



"సరే, దానిదేముంది- మీరు నా ప్రాణ దాతలు. బాగా అలసిపోయినట్లు తెలుస్తూనే ఉంది. ముందు పడుకొని విశ్రాంతి తీసుకోండి. నేనున్నానుగా, కాపలాకు?" అన్నాడు ఆశారాం.

పడుకోగానే గాఢమైన నిద్ర పట్టింది విష్ణువర్మకు. కాపలాగా కొంతసేపు

కూర్చోగానే ఆశారాంకి ఆలోచనలు మొదలయ్యాయి. "విష్ణువర్మ దగ్గర జమీందారు గారి డబ్బు ఉందట! చూడు! అదే సొమ్ము నీ దగ్గర ఉంటే నీకు ఈ ఖర్మ పట్టేదా? అసలు నువ్వు ఈ అడవిలోకి వచ్చేవాడివా, గుంతలో పడేవాడివా? దేనికైనా డబ్బు అవసరం..! ఇదే అవకాశం. వీడి దగ్గరున్న సొమ్మును తీసుకొని పారిపో... ఎవ్వరూ ఏమీ అనరు!" అని మనసు లోపలి భూతాలు కూశాయి.



చెడు కూతలకు లొంగిపోయిన ఆశారాం పరికించి చూశాడు. విష్ణువర్మ మంచి నిద్రలో ఉన్నాడు. అతన్ని నిద్ర లేపకుండా మెల్లగా అతని తలపాటున సంచీలో ఉన్న డబ్బును తీసుకొని పరుగు పెట్టాడు ఆశారాం.

విష్ణువర్మ లేచేసరికి సాయంత్రం కావస్తున్నది. 'ఇంత మొద్దు నిద్ర పట్టిందేమిటి?' అని అతను తటాలున లేచి చూసేసరికి ఆశారాం లేడు! కొద్ది సేపు అతని కోసం వెతికాక, అప్పుడు గమనించాడు విష్ణువర్మ- సంచీలో ఉండాల్సిన జమీందారు గారి డబ్బు కూడా లేదు!

దాంతో కొద్ది సేపటివరకూ ఏం చేయాలో తెలియలేదు అతనికి. "వెనక్కి తిరిగి పోదామంటే తన కోసం జమీందారు గారు ఎదురు చూస్తుంటారాయె! ఈ ఆశారాం తన గుర్రాన్నయితే తీసుకెళ్లలేదు- మంచిదైంది. ఊరు చేరాక, దీన్ని అమ్మి అయినా సరే, జమీందారుగారి సొత్తు జమీందారు గారికి ఇస్తాను. ఇప్పుడైతే సాయంత్రం కావస్తున్నది. ఇంకా ఆలస్యం అయితే చీకటి పడిపోతుంది! ఆలోగా అడవిని దాటాలి!" అని ఏడుపు మొహంతో వేగంగా బయలు దేరాడు విష్ణువర్మ.

కొద్ది దూరంలోనే అతనికి ఒక దృశ్యం

కనబడింది- తుప్పల మాటున నలుగురు మనుష్యులు నిలబడి ఎవరో ఒక బాటసారిని కట్టెలతో బాదుతున్నారు-

"ఏయ్! ఎవరది?! నేను జమీందారు గారి మనిషిని! ఇంతటితో మీ పని సరి!" అంటూ గుర్రాన్ని అటువైపుకు దూకించాడు విష్ణువర్మ.

ఆ మాటలు వినగానే దోపిడీ దొంగలంతా ఎటుపడితే అటు పరుగులు పెట్టారు. తీరా దగ్గరకు వెళ్ళి చూస్తే వాళ్ళకు చిక్కి తన్నులు తింటున్నది వేరెవరో కాదు- ఆశారామే! విష్ణువర్మను చూసి, తను ఎత్తుకెళ్ళిన డబ్బుల కట్టను అతని చేతుల్లో పెట్టి సిగ్గుతో తలదించుకున్నాడు అతను-

"మిత్రమా! క్షమించు. గుంటలో పడి అలమటిస్తున్న నన్ను నువ్వు కాపాడావు. అయినా దురాశ కొద్దీ నేను నీ దగ్గరున్న డబ్బును దొంగిలించాను. ఇప్పుడు నువ్వు నన్ను మరోసారి కాపాడావు.. నీ మంచితనం ముందు నేనెంతవాడినో అర్థమైంది. నన్ను తీసుకెళ్ళి జమీందారుకు అప్పగించు. నమ్మిన వారిని మోసం చేసిన నాకు ఎంత కఠినమైన శిక్ష విధించినా చాలదు.." అని ఏడ్చాడు ఆశారాం.

"జమీందారు గారి డబ్బు తీసుకెళ్ళావని తప్ప, నీమీద నాకు వ్యక్తిగతంగా ఎలాంటి కోపమూ లేదు. నాతో పాటు గుర్రం ఎక్కు. అడవి దాటినాక నీ దారిన నువ్వు పోవచ్చు" అన్నాడు విష్ణువర్మ దయతో.


"వద్దులెండి. నాకు బుద్ధి వచ్చింది. ఇకమీద మోసాలు చేయను- నీతివంతమైన జీవితం గడుపుతానని మాట ఇస్తున్నాను. మీరిక వెళ్లండి" అంటూ కన్నీళ్లతో అతన్ని సాగనంపాడు మారిపోయిన ఆశారాం.



రోగి: డాక్టరు గారు! మీరు రాసిన మందుల చీటి పోయిందండి.

డాక్టరు: అంతేనా! నేనింకా మీ జబ్బు పోయిందేమోనని ఎంత కంగారు పడ్డానో!

Y. బాలాజీ, ఎనిమిదవ తరగతి, గుండువారి పెల్లె



మేలుకొలుపు

రచన: శ్రీమతి ఆదూరి హైమవతి, విశ్రాంత ప్రధానోపాధ్యాయిని, బెంగులూరు.

"తాతా! మీ కొడుక్కు నువ్వైనా చెప్పచ్చుగా! ప్రతి శుక్రవారం రాత్రి ఇక్కడికీ, ప్రతి ఆదివారం రాత్రి ఆ ఫైవ్ స్టార్ హోటలుకూ, ఇట్లా అందరినీ ఈ మూడు వారాలుగా ఎందుకు తిప్పుతున్నాడు నాన్న? అసలిదంతా ఎందుకు?" తాత దగ్గరకొచ్చి గుసగుసగా అడిగాడు అవినాష్.

"ఒరే నా కొడుక్కొడుకా ! ఆ అడిగేదేదో నా కొడుకునే అడగరాదురా?! నన్నడిగితే నేనేం చెప్తానూ?" అన్నాడు తాతయ్య, ఉత్సాహంగా.

"అమ్మో మానాన్ననే! భయం బాబూ!"

"ఏరా ఎందుకూ భయం? మీ నాయనేమన్నా దయ్యమా, భూతమా?"

"ఐనా ఆయనెందుకు తాతా? నువ్వున్నావుగా, చెప్పేందుకు? నువ్వే చెప్పు!" ప్రాథేయపడ్డాడు అవినాష్.

"సరే, అయితే నువ్వు ఇంకో పదివారాలు

ఆగు- నీకే తెలుస్తుంది, అప్పటికీ తెలీకపోతే నేను చెప్తాను- సరేనా?!" అంటూ, చల్లని పూరి గుడిసెలో, పేడ అలికిన నేలమీద పరచిన తాటాకుల చాప మీద- అటుకేసి తిరిగి పడుకున్నాడు తాత....

పది వారాలు గడిచాయి-



"ఒరే!ఎక్కడున్నావురా, అవినాష్?!"

మనవడికోసం పల్లెలోని వీధులన్నీ తిరిగి తిరిగి చివరికి ఊరి నడిబొడ్డుకు వచ్చాడు తాత. అక్కడ పంచాయితీ ఆఫీసు ముందు ఉన్నది ఓ వేపచెట్టు. దాని క్రింద, అరుగు దగ్గర చిల్లాంకట్టె (కోడుంబిళ్ల-గిల్లీడండా) ఆడుతున్న మనవడిని చూసి "ఏరా, ఒరే నా కొడుక్కొడుకా! మనం వెళ్ళే సమయమైంది. నా కొడుకు నీకోసం కార్లో కాచుకొని కూర్చున్నాడు, రా నాయనా!" అన్నాడు.

"తాతా! ఇంకో గంట ఆగి వెళితేనేం? అసలు ఏముందక్కడ?! ఆ ఏసీకి ఒళ్ళంతా ఎండుతుంటుంది; ఇంక ఆ హోటల్లో ఎప్పుడో వండిన కూరలు వేడి చేసి, రుచీ పచీ లేకుండా పెడతారు. తాతా! నువ్వు చెప్పవూ, నాన్న నేను చెబితే వినడు?!"

"ఏరా! నేనేమన్నా నీకూ మీ నాయనకూ మధ్య పోస్టు నడిపే బంట్రోతును అనుకున్నావేరా? నాకు తెలీదు- పోయి నువ్వే అడుగు. ఐనా చక్కగా క్రికెట్ ఆడేవాడికి ఈ గలీజు కోడుంబిళ్ళ ఏంట్రా?"

"అబ్బ, తాతా! నీకేం తెల్సు, ఈ కోడుంబిళ్ల మజా? అయినా వాళ్ల తోటలో పండిన జామపండ్లు, తేగలు తెస్తానని వెళ్ళాడు వీరయ్య. వాడు తిరిగి వచ్చే వరకూ నన్ను రమ్మనకు ప్లీజ్.. " అంటూనే ఆటని ఆపి, అరుగు ఎక్కి చూడసాగాడు అవినాష్.

అంతలోనే వీరయ్య గస పెట్టుకుంటూ

పరుగెత్తుకొచ్చాడు. ఓ చిక్కంలో అరమాగిన జామ పండ్లూ, తేగల కట్టా తెచ్చి అవినాష్ చేతికి ఇచ్చాడు. వాడు అవి తీసుకుని, వీరయ్యను గుండెలకు హత్తుకుని "థాంక్స్ రా! మళ్ళా శుక్రవారం వస్తా, నీకు మిఠాయి ఉండలు తెస్తాన్లే!" అంటూ అవన్నీ తీసుకుని కదిలాడు.



"ఒరే మనవడా! అదేంట్రా, ఆ 'ఛీ..పాడు!' తేగలు తీసుకుని, ఆ మొరటు వీరడిని- చెమట వీరడిని- అలా హత్తుకున్నావ్?! వాడెక్కడ, నువ్వెక్కడరా?" అడిగేశాడు తాత, వెటకరిస్తున్నట్లు.

తాతకేసి కోపంగా చూస్తూ "అను, తాతా, అను! ఇదివరకు నేను అన్న మాటల్నే ఇప్పుడు మళ్ళీ నాకు తిరిగి రామ బాణంలా కొడుతున్నావ్ కదూ?! ఈ వీరయ్య ఎంత మంచివాడో తెలుసా, నీకు? నాకోసమనే ప్రత్యేకంగా వాళ్ళ తోటలోకి వెళ్ళి, నాకు ఇష్టమైన జామకాయలు, తేగలూ తెచ్చి ఇస్తున్నాడు చూడు! ఇట్లాంటి స్నేహితులు పట్నంలోఎక్కడ దొరుకుతారు తాతా?!

ఇంత చల్లటి గాలి,ఇల్లు, కల్మషం లేకుండా మాట్లాడే మిత్రులు, కమ్మని గుమ్మ పాలు, ఇంత చక్కగా మ్రోగే మువ్వల గంటలు- ఇక్కడి లేగ దూడలతో పరుగు పందెం వేసుకొని చూడు, అవే గెలుస్తాయ్- అసలు ఈ పల్లెకూ మన పట్టణానికీ అసలు పోలికే లేదు" అన్నాడు అవినాష్.

"అవునా, నాయనా?! మరి పదినెల్ల క్రితం నువ్వే దీన్ని 'ఛీ..పాడు పల్లె' అన్నావే?!" అడిగాడు తాత, సూటిగా.

"అయాం సో సారీ తాతా, అట్లా అన్నందుకు! ఈ ప్రశాంతతలో ఉండే సుఖం అప్పుడు నాకు అసలు తెలీనే లేదు" అని విచారంగా ముఖం పెట్టాడు ఎనిమిదోక్లాసు

ఇంగ్లీష్ మీడియం మనవడు అవినాష్.

ఇద్దరూ కారులోకి వచ్చి కూర్చునే సరికి అవినాష్ చెల్లెలు మాధురి అంటున్నది "నాన్నా! మనం మన ఇంటికి వెళ్ళిపోదాం నాన్నా, హోటలుకు వద్దు! అసలైతే ఇవాళ్ళ రాత్రికి ఇక్కడే ఉండి, రేపు నేరుగా ఇంటికి వెళ్దాం" అని. మాధురి చేతులు గోరింటాకుతో ఎర్రగా పండి ఉన్నాయి.

తాతయ్య చెప్పాడు: "పిల్లలూ! మేం చిన్నప్పుడు పిట్టల మేలుకొలుపులతో లేచి, వేప పుల్లతో పళ్ళు తోమి, గుమ్మపాలు త్రాగి, బడికెళ్ళి చక్కగా చదువుకున్నాం. మీరేమో పట్టణపు పిల్లలాయె! మరి మీకు ఆ రోజుల్ని పరిచయం చెయ్యాలి కదా, పల్లె జీవితపు మధురిమని మీకూ అందించాలి కదా? అందుకనే ప్రతి శుక్రవారం మనందర్నీ ఇక్కడికి తీసుకొస్తున్నాడ్రా, మీ నాన్న! మరి నగరాల్లో జనాలు తినే తిండి ఎంత ఘోరంగా ఉంటోందో మీకు కూడా తెలియాలనేరా, ప్రతి ఆదివారం రాత్రి మిమ్మల్ని బయటికి తీసుకెళ్ళి డిన్నర్ పెట్టిస్తున్నది! కాలుష్యంతో నిండిన నగర వాతావరణానికీ, ప్రశాంతంగా ఉండే పల్లె వాతావరణానికీ ఎంత తేడా ఉందో చూశారా?!" నవ్వాడు తాత, వాళ్ళ తలలు నిమురుతూ.

తాత చేతులు పట్టుకొని "నిజంగానే బాగా తెలిసిపోయింది తాతా! ఫైవ్ స్టార్ హోటలు వాళ్ళు ఐదు రోజుల పాత వాటిని, త్రీస్టార్ హోటలు వాళ్ళు మూడు రోజుల పాత వాటిని మళ్ళీ వేడి చేసి తేగలరు! అంత సాంకేతికత ఉంటుంది వాళ్ల దగ్గర. అయినా మాకిప్పుడు ఆ తిండి అంటే మొహం మొత్తింది. పల్లెలో దొరికే తేగలు, కొబ్బరి నీళ్ళు, తాటిముంజెలు, గడ్డపెరుగు- వీటి రుచి మరి దేనికీ రావు! ఇక్కడి స్నేహాల్లో మంచితనం ఉంది. మన పల్లెలు బలే ఉంటాయి.." మెరిసే కళ్లతో చెప్తున్న పిల్లలిద్దరినీ మురిపెంగా చూశారు తాత, అమ్మ, నాన్న!



'తల్లి తండ్రులు వృద్ధులై నిస్సహాయ స్థితిలో ఉన్నప్పుడు వారిని రక్షించడం పిల్లల బాధ్యత'

-మహాత్మా జ్యోతి బా పులే

పదాల్ని వెతికి పట్టుకోండి!

జ్వరము, బలహీనత, ఆరోగ్యం, కడుపునొప్పి, జలుబు, దగ్గు, బొప్పాయి, ఆపిల్, అరటి, దానిమ్మ, జామకాయ, ద్రాక్ష, దోసకాయ, నారింజ, పనస, సీతాఫలం, సపోటా, నేరేడు, మామిడి, అంజూర. - ఈ పదాలన్నీ క్రింది పట్టికలో దాగున్నాయి- నిలువుగా, అడ్డంగా, వాలుగా, క్రిందినుండి పైకి- ఎటుపడితే అటు! వాటిని వెతికి పట్టుకోండి! వాటి చుట్టూ గుండ్రాలు గీయండి చూద్దాం!

అ	న	రిం	లు	దా	త	క్ష	రిం	జ	ప్పా	బ	నా
యి	ప్పా	లు	టా	పో	స	బొ	ఆ	పి	ల్	ని	ఆ
ఇ	జ	బ	ల	హీ	న	త	హి	రో	బా	న	యి
ర	రిం	అ	హ	డు	ప	ద్రా	ఆ	మ్మ	గ్యం	టా	అం
ఉ	నా	బ	దా	అం	టి	ల	స	పి	పో	మ్మ	బ
జ్వ	ద	ని	ల	ర	జూ	నే	ము	నా	ని	హీ	న
రిం	త	లం	అ	గ్గు	మ్ము	ర	నా	దా	బ	మా	మ్ము
త	మి	ఫ	నే	రిం	జ్వ	పో	స	డు	రే	నే	వ
జా	రే	తా	ప్పి	నొ	పు	డ	క	ద	రిం	యి	నం
మ	నా	సీ	డు	టీ	డి	మి	మా	హీ	ప్పా	అ	ఫ
కా	నా	నే	జ	గ్గ	ద	ల	జ	బొ	ద్రా	క్ష	తా
య	అం	య	కా	స	దో	జూ	ర	ద్ర	ప	న	సీ

నవ్వాలి, నవ్వించాలి- కానీ నవ్వులపాలు మాత్రం కాకూడదు!

పదరంగం-77

నిర్వహణ: డా. శిరీష, మిర్యాలగూడ, నల్గొండ జిల్లా.

1		★	2	3	
	★	4			★
5	6		★	7	8
9		★	10		
★	11			★	
12		★	13		

అడ్డం-నిలువు ఆధారాల సహాయంతో ఈ గడులను నింపగలరేమో చూడండి. నింపిన పదరంగాన్ని, కేవలం పోస్టుకార్డుపై రాసి, మాకు అందేట్లు పంపండి. మీ బడి పేరు, తరగతి, మీవాళ్ల ఫోను నంబరు తప్పక రాయండి. సరైన సమాధానం రాసి ఎంపికైన ముగ్గురు పిల్లలకు కొత్తపల్లి-79 ని బహుమతిగా పంపిస్తాం!

కొత్తపల్లి ప్రచురణలు, 1-127/A, యం ఆర్ వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా-515101

నిలువు:

1. వారాల్లో మొదటిది (4)
2. తెలుగులో 'పోస్ట్' (2)
3. తడబడిన 'సరంజామా' (4)
4. 'జబ్బు' కి మరో పేరు (2)
6. తెలుగులో Chemical- (4)
8. 'విమర్శలు' అక్షరాలు క్రమం తప్పాయి (4)
10. 'సంబరం' ఇంకో పేరు (3)

అడ్డం

1. తెలుగు 'GAME' (2)
2. 'మాట' తో అంతమయ్యే కూరగాయ-ఎటు తిరగేసినా అది మాత్రం మారదు (3)
4. వ్యాపారి చేసేది (3)
5. రాముడు సముద్రానికి ఇది కట్టాడట! (3)
7. 'పేదవాడి ఆపిల్' ఈ పండే (2)
9. తిరగబడిన సారం (2)
10. ఎండాకాలాన్ని ఇలా కూడా పిలుస్తాం (3)
11. నరకాన్ని ఏలేదెవరు?(3)
12. అడవికి ఇంకో పేరు (2)
13. కలకి బహువచనం(3)

Form IV

Statement about ownership and other particulars about newspaper **Kottapalli** :

1. Place pf publication: Kottapalli Prachuranalu, 1-127/A, Near MRO Office, Chennekothapalli, Ananthapuramu District, A.P. - 515101
2. Periodicity of publication: Monthly
3. Printer's Name : Narayana Sarma G.V.
   Nationality: Indian
   Address: 1-127/A, Near MRO Office, Chennekothapalli, Ananthapuramu District, A.P. - 515101
4. Publisher's Name: Narayana Sarma G.V.
   Nationality: Indian
   Address: 1-127/A, Near MRO Office, Chennekothapalli, Ananthapuramu District, A.P. - 515101
5. Editor's Name: Narayana Sarma G.V.
   Nationality: Indian
   Address: 1-127/A, Near MRO Office, Chennekothapalli, Ananthapuramu District, A.P. - 515101
6. The Names and Addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one percent of the total capital:
   Dr. Samatha Potu, President, Satya- Foundation For A Healthy Society, 'Sri Krupa', Near Bus Stand, Chennoor, Adilabad District, Telangana State- 504201

I, Narayana Sarma G.V. hereby declaere that the particulars given above are true to the best of my knowledge and belief.

Date: 26-08-2015 **Signature Of the publisher:** Narayana


ORIGINAL

भारत सरकार
GOVERNMENT OF INDIA

भारत के समाचारपत्रों के पंजीयक का कार्यालय
OFFICE OF THE REGISTRAR OF NEWSPAPERS FOR INDIA
पंजीयन प्रमाण–पत्र
CERTIFICATE OF REGISTRATION

प्रमाणित किया जाता है कि प्रेस और पुस्तक पंजीकरण अधिनियम, 1867 के अन्तर्गत इस समाचारपत्र को पंजीकृत कर लिया है
This is to certify that this newspaper has been registered under the Press and Registration of Books Act, 1867 :

1. समाचार पत्र का नाम / Title of the Newspaper	KOTTAPALLI
2. समाचार पत्र की पंजीयन संख्या / Registration Number of the Newspaper	APTEL/2014/62705
3. भाषा/भाषाएं, जिसमें/जिनमें समाचारपत्र प्रकाशित किया जाता है / Language/Languages in which it is published	तेलुगु TELUGU
4. इसके प्रकाशन का नियतकाल तथा जिस दिन/दिनों/तिथियों को यह प्रकाशित होता है / Periodicity of its publication and the day/days/dates on which it is published	मासिक MONTHL
5. समाचारपत्र की फुटकर कीमत / Retail selling price of the newspaper	Rs. 25/-
6. प्रकाशक का नाम/Publisher's Name	NARAYANA SARMA G.V.
राष्ट्रीयता/Nationality	INDIAN
पता/Address	KOTTAPALLI PRACHURANALU, 1-127/A, NEAR MRO OFFICE, CHENNEKOTHAPALLI-515101, ANANTHAPUR DIST, ANDHRA PRADESH
7. मुद्रक का नाम/Printer's Name	NARAYANA SARMA G.V.
राष्ट्रीयता/Nationality	INDIAN
पता/Address	1-127/A, NEAR MRO OFFICE, CHENNEKOTHAPALLI-515101, ANANTHAPUR DIST, ANDHRA PRADESH
8. सम्पादक का नाम/Editor's Name	NARAYANA SARMA G.V.
राष्ट्रीयता/Nationality	INDIAN
पता/Address	1-127/A, NEAR MRO OFFICE, CHENNEKOTHAPALLI-515101, ANANTHAPUR DIST, ANDHRA PRADESH
9. जिस स्थान पर मुद्रण का काम होता है, उसका सही तथा ठीक विवरण / True and precise account at the premises where printing is conducted	MUDRICA QUALITY OFFSET PRINTERS SANYASI RAJU STREET OF GANDHI NAGAR, VIJAYAWADA, ANDHRA PRADESH
10. प्रकाशन का स्थान / Place of publication	KOTTAPALLI PRACHURANALU, 1-127/A, NEAR MRO OFFICE, CHENNEKOTHAPALLI-515101, ANANTHAPUR DIST, ANDHRA PRADESH

दिनांक /Date 18 JUN 2015

(एस. एम. खान S.M. KHAN)
भारत के समाचारपत्रों के पंजीयक
REGISTRAR OF NEWSPAPERS FOR INDIA

Owner(for reference):
KOTTAPALLI PRACHURANALU

ప్రస్తుతం అందుబాటులో ఉన్న కొత్తపల్లి ప్రింటు పుస్తకాల వివరాలు:

క్రమ సంఖ్య	వివరాలు	ఒక సెట్ లోని పుస్తకాల సంఖ్య	స్టాకులో ఉన్న సెట్లు (సుమారుగా)	వెల (రూ) (పోస్టేజి 50 రూ. అదనం)
1	2011 Set	11	50	220
2	2012 Set	11	30	220
3	2013 Set	7	25	175
4	2014 Set	10	600	250
5	2015 Set	4	1400	100

వివరాలకోసం సంప్రతించండి:

కొత్తపల్లి ప్రచురణలు
1-127/A, యం ఆర్ వో ఆఫీసు దగ్గర,
చెన్నేకొత్తపల్లి, అనంత పురము జిల్లా- 515101
Phone: 7702877670, 9000453887

Our Bank Account Details:
SB A/c : Kottapalli prachuranalu
A/c No: 62320333310
State Bank Of Hyderabad,
Dharmavaram Branch
IFSC: SBHY0020902

కొత్తపల్లి కథల పుస్తకాలను ఇంటర్నెట్లో పూర్తిగా ఉచితంగా చదవచ్చు, డౌన్లోడు చేసుకోవచ్చు!
సందర్శించండి: http://kottapalli.in. మెయిలు ద్వారా సంప్రతించండి: team@kottapalli.in

RNI Regn No. : APTEL/2014/62705

కథల కథ

అనగా అనగా ఒక చిన్న కథ తయారైంది. గెంతుకుంటూ, ఆడుకుంటూ పోతోంది ఆకాశంలో. అంతలో దానికొక రామచిలుక ఎదురైంది.

"చిట్టి కథా, చిట్టి కథా! నువ్వు భలే కనిపిస్తున్నావు. నేను నిన్ను తీసుకుంటాను, ప్లీజ్!" అన్నదది.

"తీసుకో, తీసుకో! దాందేముంది? నేనున్నదే అందరికోసం!" అన్నది చిన్న కథ.

రామచిలుక చిట్టి కథను తీసుకోగానే కథలు రెండైనై! చిలకేమో ఒక కథను పట్టుకొని ఎగురుకుంటూ పోయింది- బిగ్గరగా అరుచుకుంటూ.

ఇంకోకథ తన దారిన తను పోతూ ఉంటే చిన్నారి పాప ఒకతె ఎదురైంది దానికి, ఓ చెట్టుకొమ్మను పట్టుకొని.

"ఏం, చిన్నారీ! ఎటు పోతున్నావు, ఒక్కతెవే? మీ అమ్మేది?" అంది కథ.

"అమ్మ పోయి కొమ్మ వచ్చె ఢాం ఢాం ఢాం!" అని నవ్వింది పాప. కథకి పాపను చూస్తే ముచ్చట వేసింది.

అది పాపతో కలిసి పోయి, వాళ్ళ అమ్మనీ, అమ్మమ్మనీ, నాన్ననీ అందర్నీ చుట్టుకొని వచ్చింది.

రామచిలుక అక్కడ అరచుకొంటూ పోతుంటే మొద్దురాముడు ఎదురయ్యాడు దానికి: "ఏయ్! చిలకా! భలే కథ ఉన్నట్లుందే, నీ దగ్గర? నాకూ చెప్పు! వింటాను!" అన్నాడు వాడు.

"ఊరికే వింటే ఏం లాభం? రాయాలి! నీకు చేతులున్నై కద!" అంది చిలుక.

"ఊహ్! ఓహ్! అయ్యో! రాయటం రాదే!" మూలిగాడు వాడు.

"కుదరదు నాన్నా! నన్ను అందుకుంటే రాయాల్సిందే!" అన్నది కథ. "సరే" అని వాడు రాయటం నేర్చుకున్నాడు.

ఈ సారి ఒక్క కథే పది కథలైంది- ఎవరెవరినో చేరింది. అందరికీ చదవటం నేర్పింది.

ఆ కథని చదివిన పిల్లలెవ్వరూ దాన్ని ఆపుకోలేదు- అందరి దగ్గరా అది రెండింతలు అవుతూనే పోయింది. ఆ పిల్లల స్నేహితులు- వాళ్ళ అమ్మా నాన్నలు- వాళ్ళ స్నేహితులు- ఇట్లా పోతూనే ఉంది కథ- అందరూ విన్నారు; అందరూ చదివారు; అందరూ చెప్పారు!

చాలా ఏళ్ళ తర్వాత మాకు చెప్పిందొక పాప, ఆ కథని- "ఓయ్, కథా! రా!నిన్ను కొత్తపల్లిలో వేస్తాం" అన్నాం మేం.

"మా బాగా వేసుకోండి! నేనున్నదే అందరికోసం!" అన్నది కథ.

"సరేగానీ, నిన్నెవరు తయారు చేశారు, మొదట?" అడిగాం, మేం, పెద్దవాళ్ళం.

"అయ్యో! నేను ఎన్ని చోట్ల తిరిగాను, ఎంత మారాను! ఎప్పుడో ఒక రామచిలుక పాడింది నన్ను! ఒక మొద్దు రాముడు రాశాడు నన్ను! కానీ ఎందరు పిల్లలు బ్రతికించారో, ఏం చెప్పను? ఎంతమంది పెద్దలు మెచ్చి కాపాడారో, ఏమనను? మీరేమైనా మొదటివాళ్ళా? మీపని మీరు కానివ్వండి! నా దారిన నేను ఎగురుతూనే ఉంటాను" అని నవ్వింది కథ.

ఇదీ, ఈ కథల కథ!

Printed and Published by Narayana Sarma on behalf of Kottapalli Prachuranalu and printed at Mudrica Offset Printers, Vijayawada and published at "Kottapalli", 1-127/A, Near MRO Office, Chennekothapalli, Ananthapuram District, AP-515101. Editor: Narayana Sarma.